

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 09-04-2025 | సంపుటి - 22 | సంచిక - 345 రూ : 4 | పేజీలు: 8


## రిజిస్ట్రేషన్లకు.. స్లాట్ బుకింగ్

- గంటల తరబడి నిరీక్షణకు తెర
- 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రేపటి నుంచి అమలు
- రెండేసి రిజిస్ట్రేషన్ల అడ్డుకట్టకు చట్టసవరణ
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2లో



## వడగళ్లు.. అన్నదాతకు కడగండ్లు

- మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో వేల ఎకరాల్లో పంట నష్టం

మహబూబాబాద్, మంగపేట: అకాల వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చాయి. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో సోమవారం రాత్రి ఉరుములు, ఈదురుగాలులతో వడగళ్లు పడ్డాయి. దీంతో వరి, మామిడి, బొప్పాయి రైతులకు తీవ్ర నష్టం కలిగింది. పలుచోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలమట్టమయ్యాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. నివాసాలపై రేకులు ఎగిరిపోయాయి. మహబూబాబాద్ జిల్లాలో 8.6 సెం.మీ., ములుగు జిల్లాలో 6.7 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో 12 మండలాల్లోని 38 గ్రామాల్లో 3,298 ఎకరాలు, ములుగు జిల్లాలో ఐదు మండలాల్లో 9,110 ఎకరాల్లోని వరి, మొక్కజొన్న, మామిడి, అరటి, బొప్పాయి, సపోటా పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. అత్యధికంగా వరిపంట దెబ్బతింది. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనూ పంట నష్టం వాటిల్లింది.

## వారికి ఉరే సరి

- అది తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు
- నిందితులు దేశంపై యుద్ధం ప్రకటించారు..
- సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే, అభద్రతా భావాన్ని సృష్టించే ప్రయత్నం చేశారు
- దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు
- ఐదుగురికి ఉరి ఖరారు చేసిన ధర్మాసనం



2లో



## 57 పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

- స్పీకర్, మంత్రులకు ఉద్యోగుల ఐకాస వినతిపత్రాలు అందజేత

హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 57 సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగుల ఐకాస దశల వారీ ఆందోళనల్లో భాగంగా మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పలువురు మంత్రులకు ఐకాస నేతలు వినతిపత్రాలు అందజేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ తదితరులను కలిసి ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు సదానందంగౌడ్, ముజీబ్, సత్యనారాయణ, కటకం రమేష్, శ్యామ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, భాజపాల ఉమ్మడి సీఎం రేవంత్

- కంచ గచ్చిబౌలి భూముల వేలం వెనుక భారీ కుంభకోణం
- అందులో భాజపా ఎంపీ కూడా ఉన్నారు
- త్వరలో వివరాలు బయటపెడతా
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని, ముఖ్యమంత్రిని కాపాడుతున్నది కేంద్రంలో ఉన్న భాజపా

తరువాయి 2లో

## మీ వీసా రద్దు చేస్తున్నాం..

### అమెరికా నుంచి వెళ్లిపోండి

- విద్యార్థులపై తీవ్ర చర్యలకు ఒడిగడుతున్న ట్రంప్ సర్కారు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం సహా వేర్వేరు కారణాలు
- ప్రశ్నార్థకంగా తెలుగు విద్యార్థుల భవిష్యత్తు

అమరావతి: భవిష్యత్తుపై ఎంతో ఆశతో అమెరికాలో చదువుకోవడానికి వెళ్లిన భారతీయ విద్యార్థుల ఆశలను ట్రంప్ సర్కారు చిదిమేస్తోంది. ఏడాది, రెండేళ్ల కిందటి చిన్న చిన్న తప్పులను ఎత్తి చూపిస్తూ వీసాలు రద్దు చేస్తోంది. తక్షణం దేశం విడిచి వెళ్లాలంటోంది. స్వచ్ఛందంగా వెళ్లకపోతే బలవంతంగా పంపించాల్సి వస్తుందని హెచ్చరిస్తోంది. నార్త్‌ఈస్ట్రన్, హ్యాంప్‌షైర్, విస్కాన్సిన్ మాడిసన్ తదితర విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న పలువురు విద్యార్థులకు ఇలాంటి నోటీసులు అందాయి. ఇందులో

తరువాయి 2లో



## ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా జలహారతి కార్పొరేషన్

- ఉపాధ్యక్షుడిగా జలవనరులశాఖ మంత్రి
- వరద జలాల సద్వినియోగం కోసమే ఏర్పాటు
- రూ.5 కోట్ల పెట్టుబడి వాటా
- ప్రభుత్వ ఉత్తర్వులు



2లో



## రక్షణ సంబంధాలు బలోపేతం చేసుకుందాం

- భారత్-యూఏఈ అంగీకారం
- మోదీతో దుబాయ్ యువరాజు భేటీ

దిల్లీ: తమ మధ్య రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మంగళవారం నిర్ణయించాయి. అదేవిధంగా సైనిక పరికరాలను సంయుక్తంగా అభివృద్ధి పరిచే అవకాశాలను అన్వేషించాలని అంగీకారానికి వచ్చాయి. ఈ మేరకు దుబాయ్

తరువాయి 2లో

## పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి ప్రమాదం

- సింగపూర్‌లోని సమ్మర్ క్యాంపులో అగ్ని ప్రమాదం
- ఓ బాలిక మృతి.. 20 మందికి గాయాలు
- మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు కాలిన గాయాలు
- సింగపూర్ బయల్దేరిన పవన్ కల్యాణ్
- త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ సహా పలువురి ఆకాంక్ష

2లో



# మీ వీసా రద్దు చేస్తున్నాం.. అమెరికా నుంచి వెళ్లిపోండి

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు విద్యార్థులూ ఉన్నారు. ఒక్క నార్త్ఈస్ట్రన్ విశ్వవిద్యాలయంలోనే 40 మందికి వీసా రద్దు నోటీసులు అందగా ఇందులో 18 మంది ప్రస్తుతం అక్కడ చదువుతున్నవారే. మరో 22 మంది చదువు పూర్తి చేశారు. వీసా రద్దవడంతో విద్యాభ్యాసానికి సంబంధించిన సెవీస్ (స్టూడెంట్ అండ్ ఎక్స్చేంజి విజిటర్) ప్రోగ్రాం రికార్డులు కూడా అందుబాటులో ఉండవని విద్యార్థులకు విశ్వవిద్యాలయాల నుంచి మెయిల్స్ వస్తున్నాయి. దీంతో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఏం చేయాలి, ఎవరిని సంప్రదించాలో తెలియక తల్లడిల్లుతున్నారు. హమాస్ అనుకూల ఆందోళనల్లో పాల్గొన్నారంటూ అమెరికా ప్రభుత్వం గత నెలలోనూ కొందరిని పంపించేసింది.

*** వీసా రద్దయితే అక్రమంగా ఉంటున్నట్లే..**

అధిక వేగంతో వాహనాలు నడిపిన పలువురు విద్యార్థులకు వీసా రద్దు చేస్తూ ఇటీవల నోటీసులు అందాయి. సాధారణంగా ఈ తరహా నేరాలపై న్యాయస్థానంలో విచారణ జరుగుతుంది. అధికశాతం కేసులు కొట్టేస్తారు. అయితే కోర్టులో కేసులు నడుస్తున్న వారికి కూడా వీసా రద్దు చేస్తూ నోటీసులు ఇచ్చారు. వీసా రద్దయితే వీరు అక్రమంగా అమెరికాలో ఉంటున్నారనే లెక్కలోకి వస్తుంది. గతంలో ఇలాంటి చిన్న చిన్న నేరాల్లో ప్రమేయం ఉంటే ఇంతటి తీవ్ర చర్యలు ఉండేవి కావు. చదువుకోవడానికి, ఓపీటీపై పనిచేయడానికి, హెచ్1బీపై ఉద్యోగం చేయడానికి.. అంటే గడువు వరకు అమెరికాలో ఉండటానికి ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు. ఇప్పుడు అమెరికాలో ఉండేందుకు వీలు లేకుండా ఏకంగా స్టేటస్ రద్దు చేసి బయటకు వెళ్లిపోవాలంటూ మెయిల్స్ పంపిస్తున్నారు.

*** సామాజిక మాధ్యమ ఖాతాలపైనా కన్ను**

విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలపైనా అమెరికా ప్రభుత్వం కన్నేసింది. ప్రభుత్వానికి, ప్రభుత్వ విధానాలకు, అమెరికా సంస్కృతి సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఎలాంటి పోస్టులు చేసిన చర్యలు తీసుకోవాలంటూ వర్తమానం పంపింది. స్నేహితులు, ఇతరులు పెట్టిన పోస్టుల్ని పరధ్యానంగా లైక్ చేసినా, ఫార్వర్డ్ చేసినా ఈ ప్రభావం తప్పదు. ఎఫ్1, ఎం1, జే1 కేటగిరీ వారికి ఇప్పటికే వీసా అందజేసినా, కొత్తగా ఇవ్వాలన్నా నిశితంగా పరిశీలిస్తున్నారు.

*** సలహాలకు ఇమ్మిగ్రేషన్ అటార్నీ..**

వీసా రద్దు చేసి, అమెరికా వదిలిపెట్టి వెళ్లాలంటూ వస్తున్న నోటీసులపై విద్యార్థులు ఇమ్మిగ్రేషన్ అటార్నీని సంప్రదించాలి. అక్కడి చట్టాలకు అనుగుణంగా వారు సలహాలు అందిస్తారు. తెలుగు సంఘాలను సంప్రదిస్తే సాయం పొందే వీలుంటుంది.

*** ఎవరికి నోటీసు లొస్తున్నాయి?**

ఎఫ్1 వీసాపై అమెరికాకు వెళ్లి చదువుకుంటున్న వారికి (సెమిస్టర్ మధ్యలో ఉన్నా)

ఓపీటీపై ఉద్యోగం చేస్తున్న వారికి

ఉద్యోగం చేస్తూ ఇటీవలే లాటరీలో హెచ్1బి దక్కిన వారికి

# పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి ప్రమాదం




సింగపూర్, ఈనాడు, అమరావతి, హైదరాబాద్: సింగపూర్లోని ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు ఏడేళ్ల మార్క్ శంకర్ గాయపడ్డాడు. అతని కాళ్లు, చేతులకు కాలిన గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి దట్టమైన పొగ చేరినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలుడు ఆస్పత్రిలో కోలుకుంటున్నాడని, అపాయమేమీ లేదని పేర్కొన్నారు. మూడంతస్తుల భవంతిలో జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో 15 మంది పిల్లలు సహా 20 మంది గాయపడ్డారు. వారిలో పదేళ్ల బాలిక మరణించినట్లు అధికారులు ప్రకటించారు. పవన్కల్యాణ్ మంగళవారం ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో ఉన్నారు. అదే సమయంలో ప్రమాద సమాచారం తెలిసింది. ఆయన అధికారిక కార్యక్రమాలను ముగించుకొని, సాయంత్రానికి హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడి నుంచి సింగపూర్ బయల్దేరి వెళ్లారు.

**వేగంగా స్పందించిన నిర్మాణ కార్మికులు**

సింగపూర్ సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ సమీపంలోని రివర్ వ్యాలీ రోడ్లో గల ఓ మూడంతస్తుల భవంతిలో ఈ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ భవనంలో కుకింగ్ స్కూలు, థియేటర్ల సముదాయం, చిన్నపిల్లలకు రోబోటిక్ సాంకేతికతను నేర్పే సంస్థ ఉన్నాయి. రెండు, మూడు అంతస్తుల్లోకి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో అక్కడ సమ్మర్ క్యాంపులో ఉన్న 15 మంది పిల్లలు సహా 20 మంది గాయపడ్డారు. వారిలో పదేళ్ల బాలిక మరణించినట్లు సింగపూర్ హోంమంత్రి షణ్ముగం ప్రకటించారు. ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కుమారుడు ఏడేళ్ల మార్క్ శంకర్ గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నట్లు సింగపూర్ పౌర భద్రతా దళం ఫేస్బుక్లో ప్రకటించింది. ప్రమాదానికి కారణాలు నిర్ధారణ కాలేదని, దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. మార్క్ శంకర్ కోలుకుంటున్నాడు: పవన్ కల్యాణ్

తన రెండో కుమారుడు మార్క్ శంకర్ ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు పవన్కల్యాణ్ తెలిపారు. చేయి, తొడపై కాలిన గాయాలతో పాటు ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లిందని వివరించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్లోని తన నివాసం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'గిరిజన ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణానికి సంబంధించిన 'అడవితల్లి బాట' కార్యక్రమంలో ఉండగా ఉదయం 8 గంటలకు మార్క్ శంకర్ వెళ్లిన వేసవి క్యాంపులో అగ్నిప్రమాదం జరిగిందని తెలిసింది. ముందు చిన్నపాటి ప్రమాదమనుకున్నా. ఈ స్థాయిలో ఉంటుందనుకోలేదు. మా కుమారుడు క్రమంగా కోలుకుంటున్నాడు. అతనికి బ్రాంకోస్కోపీ చేస్తున్నారు. పక్కనే కూర్చున్న ఓ బాబు శరీరంలో కొన్ని అవయవాలు కాలాయి. మరో పసిబిడ్డ చనిపోయింది. చాలా బాధ అనిపించింది. ఇది చాలా దురదృష్టకరమైన ఘటన. మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు చెప్పారు' అని తెలిపారు

**ఇదేరోజు జరగడం యాదృచ్ఛికం**

'ఈ రోజు నా పెద్ద కుమారుడు అకీరానందన్ పుట్టిన రోజు. ఇదేరోజు రెండో కుమారుడికి ఇలా జరగడం యాదృచ్ఛికం. ప్రమాద విషయం తెలుసుకొని, ప్రధాని మోదీ ఫోన్ చేసి మార్క్ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేయడంతోపాటు ధైర్యం చెప్పారు. అవసరమైన సహకారం అందించాలని సింగపూర్లోని భారత హైకమిషనరుకు దిశానిర్దేశం చేసినందుకు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు. అరకులో ఉండగానే సీఎం చంద్రబాబు వాకబు చేశారు. ఆయనతో పాటు మంత్రి లోకేశ్కు కృతజ్ఞతలు. నా కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసిన తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్, భాజపా నేత లక్ష్మణ్, భారాస నేతలు కేటీఆర్, హరీశ్రావు తదితరులకు కృతజ్ఞతలు' అని పవన్ తెలిపారు.

# రక్షణ సంబంధాలు బలోపేతం చేసుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ వేర్వేరుగా వ్యూహాత్మక రంగాల్లో సహకారం లక్ష్యంగా నిర్వహించిన చర్చలు ఉపకరించాయి. ఈ క్రమంలో మక్తూమ్ భారత ప్రత్యేక పర్యటన ఇరు దేశాల మధ్య పటిష్ఠమైన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మార్గం ఏర్పరచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మక్తూమ్తో సమావేశమయ్యారు. భారత్‌యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పురోభివృద్ధికి దుబాయ్ కీలకపాత్ర పోషించిందని సామాజిక మాధ్యమ పోస్టులో మోదీ తెలిపారు. మక్తూమ్ను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ కూడా దుబాయ్ యువరాజుతో విడిగా భేటీ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో గల్ఫ్ దేశంతో కలిసి పనిచేసేందుకు ఆత్రుతతో ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. మధ్య ఆసియా ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం కృషి చేసేందుకు భారత్, యూఏఈ కట్టుబడి ఉన్నాయన్నారు. రెండు రోజుల భారత పర్యటన కోసం అల్ మక్తూమ్ మంగళవారం ఉదయం దిల్లీ చేరుకున్నారు. ఇక్కడ కార్యక్రమాల అనంతరం ఆయన ముంబయిలో పర్యటించనున్నారు.

# ముఖ్యమంత్రి ఛైర్మన్గా జలహారతి కార్పొరేషన్

అమరావతి: ముఖ్యమంత్రి ఛైర్మన్గా, జలవనరుల శాఖ మంత్రి ఉపాధ్యక్షునిగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటయింది. వరద జలాల సద్వినియోగానికి దీన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంటర్ప్రైజస్గా పేర్కొన్నారు. పోలవరం బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టులు చేపట్టేందుకు దీన్ని ప్రత్యేక వాహక నౌక (ఎస్పీవీ)గా ఏర్పాటు చేశారు. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కార్పొరేషన్కు ఎండీ లేదా సీఈవోగా జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ ముఖ్య కార్యదర్శి/ కార్యదర్శి/ ప్రభుత్వం నియమించిన ఇతర అధికారి ఉంటారు. డైరెక్టర్లుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఉంటారు. ఒక్కోటి రూ.10 విలువైనవి జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పేరున 49,99,993 షేర్లు, ఏడుగురు డైరెక్టర్ల పేరున ఒక్కో షేరు మూలధన పెట్టుబడిగా పెట్టారు.

**పోలవరం - బనకచర్ల అనుసంధానమే ప్రధానంగా..**

గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు నుంచి శ్రీశైలం కుడి కాలువపై ఉన్న బనకచర్ల కాంప్లెక్సుకు తరలించాలనేది ప్రణాళిక. హైడ్రాలజీ అధ్యయనం ప్రకారం ఏటా గోదావరి నుంచి వరద జలాలు 90 నుంచి 120 రోజులపాటు సముద్రంలో కలిసిపోతున్నాయి. బొల్లాపల్లి వద్ద బ్యాలెన్సింగ్ జలాశయం ఏర్పాటు చేసి, ఈ వరద జలాలను అందులో నిల్వ చేసి రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు మళ్లించేలా పథకాన్ని రూపొందించారు. రాయలసీమలోని సింహభాగం పెన్నా పరీవాహకంలో ఉంది. వర్షాధారితమైన ఆ ప్రాంతానికి గోదావరి వరద జలాలు తీసుకువెళ్లడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టు, 9.14 లక్షల హెక్టార్ల స్థిరీకరణకు ఈ అనుసంధానం ఉపకరిస్తుంది. ఎస్పీవీ ఏర్పాటుతో ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కార్పొరేషన్ ద్వారా సొంతంగా సమీకరించుకునే అవకాశం ఉంటుంది.

# భాజపాల ఉమ్మడి సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వమేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అనేక స్కాములపై ఆధారాలు ఇచ్చినా కేంద్రం స్పందించడంలేదన్నారు. రేవంత్రెడ్డి.. కాంగ్రెస్, భాజపాల ఉమ్మడి ముఖ్యమంత్రి లెక్క ఉన్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ అని స్వయంగా ప్రధాని మోదీనే ఆరోపించారు. కానీ విచారణ జరపరు. కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేస్తుంటే భాజపా ఎందుకు అడ్డుకోవడం లేదు? హెచ్సీయూ భూముల వేలం వెనుక భారీ కుంభకోణం ఉంది. దీని వెనుక ఒక భాజపా ఎంపీ కూడా ఉన్నారు. వివరాలన్నీ త్వరలో బయటపెడతా'' అని పేర్కొన్నారు.

**మేము సారథ్యం వహించలేదు**

''హెచ్సీయూ భూముల విషయంలో విద్యార్థులు, ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టాయి. వాటికి మేము సారథ్యం వహించలేదు. మద్దతుగా నిలిచాం. ఇక్కడి విద్యార్థులపై పోలీస్ కేసులను వెనక్కి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే ఇప్పటివరకూ జరిగిన నష్టానికి బాధ్యత ప్రభుత్వానిదే. వన్యప్రాణుల మరణాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలి. మొత్తం కంచ గచ్చిబౌలి భూముల వేలాన్ని రద్దు చేసేవరకూ మా పోరాటం కొనసాగుతుంది'' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

**అచ్ఛేదిన్ అంటే ఇదేనా?**

''ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు తగ్గుతుంటే.. మన కేంద్ర ప్రభుత్వం మాత్రమే గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచింది. దీంతో సామాన్యుడి జీవితం అతలాకుతలమవుతోంది. మోదీ చెప్పిన అచ్ఛే దిన్ అంటే ఇదేనా? అమెరికా సుంకాలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలతో ప్రజల ఆర్థిక సంపద కరిగిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఐటీ ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాలు తెలంగాణకు తీవ్రంగా నష్టం చేకూర్చబోతున్నాయి'' అని పేర్కొన్నారు.

# వారికి ఉరే సరి

హైదరాబాద్: లోకం చూడకుండానే..అమ్మ కడుపులోనే ఊపిరి వదిలిన పసిగుడ్డుతోపాటు 18 మంది మరణించడం సహా 131 మంది తీవ్రగాయాల పాలయ్యేందుకు కారణమైన హైదరాబాద్ దిల్సుఖ్నగర్ జంట పేలుళ్లకు పాల్పడిన ఇండియన్ ముజాహిదీన్(ఐఎం) ఉగ్రవాదులకు ఉరి శిక్ష తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. శాంతి భద్రతలకు భంగం కలిగించడమే లక్ష్యంగా చేపట్టిన వ్యవస్థీకృత నేరంలో నిందితులు భాగస్వాములని పేర్కొంది. పునరావాసం, పరివర్తన తీసుకువచ్చే నేరాలకు ఇది అతీతమని తేల్చిచెప్పింది. నిస్సహాయులైన పురుషులు, స్త్రీలు, పిల్లలు అనే విచక్షణ లేకుండా.. సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేయడం, విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా విచక్షణారహితంగా చంపడం తీవ్ర క్రూరత్వం పరిధిలోకి వస్తుందని మచ్చిసింగ్ కేసులో సుప్రీం కోర్టు తేల్చి చెప్పిందని గుర్తుచేసింది. నిందితుల సంస్కరణ, పునరావాసాలకు అవకాశం లేనపుడు యావజ్జీవ శిక్ష విధించడం వ్యర్థప్రయత్నమేనని పేర్కొంది. కోర్టు నియమించిన నిపుణులు, మానసిక వైద్యులు, రాష్ట్ర ప్రభుత్వ నివేదికలు సహా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నిందితులకు సంస్కరణకు అవకాశం లేదని పేర్కొంది. కునాల్ మజుందార్ వర్సెస్ రాజస్థాన్ కేసులో కింది కోర్టు విధించిన మరణ శిక్ష ధ్రువీకరణలో హైకోర్టు పాత్ర స్పష్టంగా ఉందని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాగద్వేషాలకు అతీతంగా కేసులోని అంశాల ఆధారంగానే నిర్ణయం వెలువరిస్తున్నామంది. పేలుళ్లకు కారకులైన ఇండియన్ ముజాహిదీన్ సంస్థకు చెందిన అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డీ (ఏ2), జియావుర్ రెహ్మాన్ అలియాస్ వకాస్ (ఏ3), మహ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్ (ఏ4), మహమ్మద్ అహ్మద్ సిద్దిబాప అలియాస్ యాసిన్ భత్కల్ (ఏ5), ఐజాజ్ షేక్ అలియాస్ సమర్ ఆర్మాన్ తుండే (ఏ6)లకు ఎన్ఐఏ కోర్టు విధించిన మరణ శిక్షను హైకోర్టు ధ్రువీకరించింది. ఇందులో జోక్యం చేసుకోవడానికి నిందితులు సరైన కారణాలను చూపడంలో విఫలమయ్యారని పేర్కొంటూ.. నిందితులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధలతో కూడిన ధర్మాసనం మంగళవారం 357 పేజీల సుదీర్ఘ తీర్పు వెలువరించింది. నేరం తీవ్రత నేపథ్యంలో ఎన్ఐఏ చట్టం కింద దర్యాప్తునకు కేంద్రం ఆదేశాలు జారీ చేయడంలో తప్పులేదంది. అంతేగాకుండా ఎన్ఐఏ కోర్టు పరిధిపై నిందితులు దాఖలు చేసిన పిటిషన్ను హైకోర్టు, సుప్రీం కోర్టులు కూడా కొట్టివేశాయంది.

# రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

హైదరాబాద్: దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజలు registration.telangana.gov.in వెబ్సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయాన్ని ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్కు రావచ్చని చెప్పారు. దీంతో సులువుగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్రంలోని 22 సబ్రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ నూతన విధానం అందుబాటులోకి వస్తుందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా 1015 నిమిషాల వ్యవధిలోనే ప్రక్రియ పూర్తయ్యేందుకు ఈ స్లాట్ విధానం దోహదం చేస్తుందని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని వివరించారు.

**ఒక్కో కార్యాలయంలో రోజుకు 48 స్లాట్లు**

సాధారణంగా ఒక్కో సబ్రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 48 స్లాట్లను అందుబాటులో ఉంచుతారు. రద్దీ అధికంగా ఉండే కార్యాలయాల్లో అదనపు సబ్రిజిస్ట్రార్లను, సిబ్బందిని ఏర్పాటుచేస్తారు. ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్రిజిస్ట్రార్లు, అదనపు సిబ్బంది నియామకం చేపట్టారు. దీనివల్ల ఇక్కడ 144 స్లాట్లు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియలో తొలుత రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్నగర్ సబ్రిజిస్ట్రార్ కార్యాలయాలను విలీనం చేస్తున్నారు. అత్యవసర సందర్భాలు ఉన్నప్పుడు లేదా స్లాట్ బుక్ చేసుకోని వారు.. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6గంటల మధ్య నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఈ విధానంలో రోజుకు 5 లావాదేవీలకు అవకాశం కల్పిస్తారు.

**దస్తావేజుల రూపకల్పనకు మాడ్యూల్**

రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు.. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్సైట్లో ఒక మాడ్యూల్ని ప్రవేశపెడుతున్నారు. తొలుత సేల్డీడ్ దస్తావేజుల కోసం ఈ సౌకర్యం అందుబాటులోకి తెస్తున్నారు. ఇది ఐచ్ఛికం మాత్రమే.

**ఆధార్ ఈ-సంతకంతో వేగం**

రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజులపై క్రయవిక్రయదారులు, సాక్షులు, సబ్రిజిస్ట్రార్ సంతకాలు చేయాల్సి ఉండడంతో.. ఈ ప్రక్రియ అధిక సమయం తీసుకుంటోంది. దీనిని నివారించడానికి ఈ నెలాఖరులోగా ఆధార్ ఇసంతకం ప్రవేశపెడుతున్నారు.

**రెండేసి రిజిస్ట్రేషన్ల కట్టడికి చట్ట సవరణ**

ఎక్కడో ఒకచోట మా ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. దీని నివారణకు.. ఈ చట్టంలోని సెక్షన్ 22కి సవరణ చేసి సెక్షన్ 22బిని తీసుకువస్తామని మంత్రి తెలిపారు.

**ప్రయోగాత్మక సేవలు ప్రారంభమయ్యేది ఇక్కడే..**

అజంపుర, చిక్కడపల్లి, కుత్బుల్లాపూర్, వల్లభ్నగర్, మేడ్చల్ (జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఆర్వో), శంషాబాద్, సరూర్నగర్, చంపాపేట, భువనగిరి, చౌటుప్పల్, సదాశివపేట, రామగుండం, కూసుమంచి, ఖమ్మం (ఆర్వో), మహబూబ్నగర్ (ఆర్వో), జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, కొత్తగూడెం, ఆర్మూర్, నాగర్కర్నూల్.

## పేద, దళిత అనే తేడా లేకుండా ఉండాలనే

# రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్నీ తీసుకొచ్చింది

*** భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : భువనగిరి పట్టణం లోని తారక రామ్ నగర్ లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి,జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి పుష్పలత నివాసం లో సన్న బియ్యం భోజనం చేశారు. ఈ సందర్భంగా భువనగిరి శాసన సభ్యులు మాట్లాడుతూ పేద వారు సంతోషంగా కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం దేశంలోని ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో మొదటి సారిగా ప్రారంభించారన్నారు. పేద, ధనిక అనే బేధాలు లేకుండా అందరికీ ఒకే రకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఒక్కో మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆర్థికంగా ముందుకు వెళ్లాలనదే ప్రభుత్వం యొక్క ఉద్దేశం అని అన్నారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..పేద కుటుంబం అయిన పుష్పలత ఇంట్లో

భువనగిరి శాసన సభ్యులతో కలిసి భోజనం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 515 రేషన్ దుకాణాల్లో 2 లక్షల 17 వేల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు ఈ సన్న బియ్యాన్ని అందించడం జరుగు తుందన్నారు. సన్న బియ్యం వచ్చాక ప్రతి పేద కుటుంబం సంతృప్తిగా కడుపు నిండా తింటున్నామని పుష్పాలత సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఇంట్లో రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యాన్ని అందించాలన్న చారిత్రాత్మక పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సన్న బియ్యంతో పాటు ప్రభుత్వం అందిస్తోన్న అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని, అభివృద్ధి సాధించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు,మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎండి అవేస్ చిస్తీ గ్రంథాలయ చైర్మన్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్,యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు నరేష్, చిక్కుల వెంకటేశం, తంగళ్ళపల్లి రవికుమార్ మజహార్ ఇలియాస్ మరియు సివిల్ సప్లై మేనేజర్ శ్రీనివాస్, సివిల్ సప్లై అధికారి వనజాత,సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బెల్లి కృష్ణను ప్రభుత్వం ఆదుకోవాలి

*** ప్రజాపార్టీ అధ్యక్షులు దాసరి అజయ్ కుమార్ యాదవ్**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు బెల్లి కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి ఆరోగ్య విషయాలను ప్రజాపార్టీ అధ్యక్షులు దాసరి అజయ్ కుమార్ యాదవ్ అడిగి తేలుసుకున్నారు.ఈ సందర్భంగా అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను గత ప్రభుత్వాలు గుర్తించలేదన్నారు. ఈ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి అక్కున చేర్చుకోవాలని అన్నారు.తెలంగాణ గానకోకిల బెల్లి లలిత విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయలండి డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలనీ కోరారు. ఆనారోగ్యంతో బాధ పడుతున్న తెలంగాణ మలిదశ ఉద్యమ నేత బెల్లి కృష్ణను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కదారి కాశీం యాదవ్, మల్లేష్, యాదవ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఈ నెల 18 నుంచి ఆలయ గోపుర కలశ ప్రతిష్ట మహోత్సవం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణం రామవరం 6 వార్డు లో ఎన్నో సంవత్సరాల నుండి ప్రసిద్ధి గాంచిన శ్రీ శ్రీ శ్రీ రుక్మిణి సత్యభామ సామెత సంతానం గోపాల స్వామి మందిరంలో మార్చి 18 ,19, 20 తేదీల్లో ఆలయ గోపురం నిర్మాణం పూర్తయి ఆలయ శిఖర కలశ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించుటకు ముహూర్తం నిర్ణయించారు. 20వ తేదీ మధ్యాహ్నం మహా అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం జరుగును.దానిలో భాగంగా మంగళవారం ఆలయ పూజారి ధర్మకర్త , భక్తుల ఆధ్వర్యంలో మహోత్సవ కరపత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమం లో కృష్ణారావు (పూజారి ), గోవర్ధన్ (ధర్మకర్త )భక్తులు జెట్టి మోహన్,దాసి రవీందర్,రామ కృష్ణ, ప్రభాకర్ , సతీష్, రవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





## ఆరోగ్యకరమైన సమాజానికిఅంగన్వాడీ కృషి

*** బాలల అభివృద్ధికి బలమైన అడుగు**

*** గర్భిణీ మహిళలు తల్లులకు పోషణపై అవగాహన**

*** ఆరోగ్యానికి మార్గం పోషణ్ పక్వాడ**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పిల్లలు భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండాలంటే చిన్ననాటి నుండే సరైన పోషకాహారం ఎంతో కీలకం ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రారంభించిన పోషణ్ అభియాన్లో భాగంగా ప్రతి సంవత్సరం మార్చి 8 నుండి ఏప్రిల్ 22 వరకు "పోషణ్ పక్వాడ" కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. కార్యక్రమం ద్వారా పోషకాహారంపై అవగాహన పెంపొందించడానికి,పిల్లలు, గర్భిణీమహిళలు, తల్లులలో సజీవ చైతన్యం నింపేందుకు అంగన్వాడీ కేంద్రాలు విశేష కృషి చేస్తున్నాయానే చెప్పాలి, కొత్తగూడెం పట్టణంలోని చుంచుపల్లి మండలం కిన్నెరస్టీల్ ,వెంకటేశ్వర కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఈ సంవత్సరం పోషణ్ పక్వాడ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఇందులో భాగంగా పోషకాహార ప్రదర్శన స్థానికంగా లభ్యమయ్యే కూరగాయలు,కందులు, మిల్లెట్లు ఆధారంగా తయారు చేసిన ఆరోగ్యకరమైన ఆహారాలను ప్రదర్శించారు.తల్లులకు , మహిళలకు శరీరానికి అవసరమైన పోషకతత్వాల గురించి వివరించడమేకాకుండా సరైన ఆహార అలవాట్లు ఎలా ఉండాలో సూచనలు ఇచ్చారు.

*** పోషకాహార ప్రదర్శనలు**

* అంగన్వాడీ కేంద్రాల్లో స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న ఆహార పదార్థాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

*** ఆరోగ్య పరీక్షలు**

* చిన్నపిల్లలకు,గర్భిణీలకు ఉచిత ఆరోగ్యతనిఖీలు, బరువు కొలవడం, హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు.

* తల్లులకోసం అవగాహన శిబిరాలు

* గర్భధారణ సమయంలో తినాల్సిన ఆహారం, పుష్కలమైన పాల ఉత్పత్తికి అవసరమైన పోషకతత్వాలు గురించి సూచనలు ఇచ్చారు.

*** పిల్లల నాటికలు,పాటలు**

* చిన్నారులు పోషకాహారంపై నాటికలు, పాటల ద్వారా సందేశాన్ని అందించారు. పోషణ్ పక్వాడ పథకంతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నాంది పలుకుతూ అంగన్వాడీ టీచర్ల కృషి, స్థానిక ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మశ్రీ,సెక్టార్ సూపర్వైజర్ సీతామంగమ్మ, అంగన్వాడీ టీచర్లు శ్రీపతిరాజేశ్వరి, ఏర్పుల గునమ్మ,ఆయాలు జి.పద్మ, ఎల్.గంగా,ఎం విజయలక్ష్మి తల్లులు,గర్భిణీ స్త్రీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను కాపాడుకుందాం

*** రాజాపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్**

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలలో కొండేటి చెరువు, ముల్లగూడెం గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరంగా మారిందని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతిగా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. బిఆర్ అంబేద్కర్ ను అవమానించేలా పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. రాజాపేట మండల కో ఆర్డినేటర ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను, మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ, దాని అనుబంధ సంస్థలు దాడులు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ దాడులను క్షేత్రస్థాయి నుంచే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని





పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేడ్కర్‌ను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందన్నారు. యువ వికాసం వంటి పథకాలు నిరుద్యోగులకు వరంగా మారుతాయన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ.. నిరుపేదల పాలిట వరం

**- యాస నరసింహారెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మండల ప్రచార కార్యదర్శి యాస నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలోని రేషన్ దుకాణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యాస నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభించారన్నారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు ఉచిత సన్న బియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం ఉచితంగా పంపిణీ జరుగుతుందని, నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి వెంకట్ రెడ్డి, పోలబోయిన ఐలయ్య, గుండెబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజపేటలో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలంలో అన్ని గ్రామాలలో భారతీయ జనతా పార్టి 45 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం జెండా ఆవిష్కరణ చేసి, స్వీట్లు పంచుకొని, బాణాసంచాలు పేల్చి, అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రము ఉద్దేశించి మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ మాట్లాడుతూ పార్టీ ఏర్పాటు సమయంలో రెండు ఎంపీ సీట్లు ఉండగా ప్రస్తుతం పూర్తిస్థాయిలో అన్ని రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ విస్తరించిందంటే వాజుపేయ్, అద్వానీ, మురళి మనోహర్ జోషి, డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ లాంటి సీనియర్ నాయకుల త్యాగాల ఫలితమే అంటూ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆవిర్భావ దినోత్సవ జిల్లా కోకన్వీనర్ కాయితీ బాలిరెడ్డి, సీనియర్ నాయకులు కానుగంటి శ్రీనివాస్ రెడ్డి,గాండ్ల నర్సింగరావు, బూర్గు శేకర్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, కుమ్మరి లక్ష్మణ్, శీలం పాపిరెడ్డి,ఆవిర్భావ దినోత్సవ మండల కన్వీనర్ మెండు భగవాన్ రెడ్డి, కోకన్వీనర్లు ఐరేణి శ్రీధర్, ముత్యం రాజు, గుజ్జ రామచంద్రం, మేడబోయిన శివరములు, భూక్య శ్రీను నాయక్, సిద్దుల రాము, సీనియర్ నాయకులు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. రాజపేటలో భారీ బైక్ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. నినాదాలు చేశారు.

## ముకుందాపురంలో కొనసాగుతున్న రేషన్ షాప్ ను ఎక్కడికి తరలించొద్దు



ప్రజాస్ఫూర్తి ఇల్లందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని ముకుందాపురం గ్రామంలో 6 నుంచి ఏడు దశాబ్దాల కాలం నుంచి కొనసాగుతున్న రేషన్ షాపును వేరే దగ్గరకి తరలించకపోవడానికి కొన్ని సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ముకుందాపురం గ్రామస్తులంతా ఏకమై ఊరు ఊరంతా ఎమ్మార్వో గారి కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చి రేషన్ షాపును ముకుందాపురం లోనే ఉంచాలని వేడుకున్నారు. అనంతరం జిసిసి ఇల్లందు వారి దృష్టికి కూడా ఈ విషయాన్ని తెలియజేయడం జరిగింది. వారు కూడా సానుకూలంగా స్పందించారు.అనంతరం గ్రామస్తులంతా స్థానిక ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య కి వినతి పత్రం ఇవ్వడం కొరకు క్యాంప్ ఆఫీస్ కు వెళ్లారు ఎమ్మెల్యే కోరం కనకయ్య గవర్నర్ మీటింగ్ నేపథ్యంలో భద్రాచలం వెళ్లడం వల్ల అందుబాటులో ఉన్న కోరం కనకయ్య సతీమణి లక్ష్మీకి వినతి పత్రం ఇచ్చినారు. ఎమ్మెల్యే వచ్చిన వెంటనే వారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి వినతి పత్రాన్ని అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముకుందాపురం గ్రామస్తులంతా పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

*** కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోది పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బిజెపి పార్టీ 45వ ఆవిర్భవ దినోత్సవ మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980లో ఏప్రిల్ 6 తేదీన స్థాపించిన పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తూ అంచలంచలుగా ఎదిగిందన్నారు. బిజెపి పార్టీ ఎదుగుదలకు కార్యకర్తలే కారణమన్నారు. ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చుకుంటూ కార్యకర్తలు పనిచేయడం వల్లనే నేడు కేంద్రంలో బిజెపి పార్టీ జెండా ఎగురుతుందని తెలిపారు. మోడీ పేద మధ్యతరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరే విధంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. దీంతో రాష్ట్రంలో బిజెపి బలోపేతం అవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కానీ హామీలతో ప్రజలను




మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని అన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ ఇప్పటివరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని దుయ్యపట్టారు. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి,కార్యక్రమ కన్వీనర్ బైరి మహేందర్, జిల్లా కౌన్సిల్ నెంబర్ భోగ శ్రీనివాస్ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిటికారి కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి శ్రీను బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి తెరల శంకర్, నాయకులు సూదగాని రాజు వడ్డేపల్లి కిషన్ ,యాదగిరి, కట్ట అమరేందర్ రెడ్డి ,కంతి రవి కాంద్రాజు శ్రీనివాస్ ,గాజుల సారయ్య ,కృష్ణమూర్తి ,గాదె వాసు, కిషోర్, గిరిబోయిన పరశురాములు, శివ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబంలో సన్న బియ్యంతో భోజనం చేసిన ఎమ్మెల్యే



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అందిచిన సన్న బియ్యంతో వండిన భోజనాన్ని నిరుపేద దళిత కుటుంబ సభ్యులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కలసి భోజనం చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకోసం అందజేసిన సన్న బియ్యంతో పేద ప్రజల ఇంట్లో ప్రతి పండుగ చేసుకుంటున్నారని ఈరోజు వారితో కలిసి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాసరావు ఎంపీడీవో రాజా త్రివిక్రమ్ మండల పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి మల్లేశం మహిళా విభాగం నాయకురాలు బానోతు సునీత భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అద్దం అడుగు రాజేష్ పైలెట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశెట్టి చంద్రశేఖర్ మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మాసాయిపేట గ్రామంలో పిఏసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో పిఏసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ మాసాయిపేట నా సొంత గ్రామం లాంటిది, వ్యవసాయం చేసిన ఏ రైతు కూడా ఇబ్బంది పడకుండా ఉండాలని రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు., రైతులు అమ్మిన మూడు రోజుల్లోనే వారి ఖాతా లోకి, డబ్బులు జమ చేసే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. గతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని తెలిపారు,అలాంటి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ఏ రైతు కూడా ఇబ్బంది పడద్దని రైతులకు ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు, మాసాయిపేట గ్రామానికి చెరువులోకి నీరు తీసుకొని రాలేదని ప్రతిపక్షాలు చిల్లర మల్లర రాజకీయాలు చేస్తూ మద్యం మత్తులో సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఈ సమంజసం కాదని అన్నారు, ఎంత డబ్బు ఖర్చైనా మాసాపేట చెరువులో నింపి అ రైతుల కాళ్లు కడుగుతామని అన్నారు... ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి నసీరుద్మిన్,మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం,పిఏసిఎస్ డైరెక్టర్స్ కోలలింగం గౌడ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏమాల మెలేందర్ రెడ్డి,మక్క చైర్మన్లు ఎర్రగుంట కిష్టయ్య,సుంచు ఈదయ్య,మహిళా అధ్యక్షురాలు గూడూరు కనకమ్మ, మండల మైనార్టీ అధ్యక్షులు ఎండి యాకూబ్ అలీ, తాపీ మేస్త్రి సంగం అధ్యక్షుడు సగ్గు కిష్టయ్య,కాంగ్రెస్ నాయకులు కల్లెం విజయా జహంగీర్, మాజీ వార్డు సభ్యులు సుంచు వినోద్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి యాకూబ్,సుడుగు బాలెరెడ్డి, మాజీ పిఏసిఎస్ చైర్మన్ కానుగట్ల చంద్రశేఖర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు పాండవుల సత్య ప్రకాష్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మండలానికి చేరిన ఏకరూప దుస్తుల వస్త్రం




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: 202526 విద్యా సంవత్సరమునకు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తుల వస్త్రం మండలానికి చేరింది.పాఠశాల వారీగా చేసిన వస్త్రాన్ని కొత్తగూడెం ఎంఈఓ డా.ప్రభుదయాల్ ఆయా హెచ్ఎం లకు అందిస్తూ,ముందుగానే ఎంపిక చేసిన స్వయం సహాయక బృందాల దర్జీలకు ప్రతి విద్యార్థి వారీ కొలత ప్రకారం ప్రభుత్వం సూచించిన మేర కుట్టించాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ




ప్రజాస్ఫూర్తి ఇల్లందు: అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురిని సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఇల్లందు శాసనసభ్యులు గౌరవ,శ్రీ.కోరం కనకయ్య గారు పంపిణీ చేశారు నియోజకవర్గంలోని 108 లబ్ధిదారులకు 34.5 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కుల ద్వారా అందజేశారు అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ఏట వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతని అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదరికంతో బాధపడుతూ.. అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించడం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తుంది అన్నారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు బ్యాంకులో వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎదలపల్లి అనసూయ గారు, దమ్మలపాటి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, పట్టణ మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు మాజీ ఎంపీటీసీలు పూనెం సురేందర్ పాయం కృష్ణ ప్రసాద్, మాజీ సర్పంచులు పాయం లలిత, కల్తీ పద్మ, తాటి చుక్కమ్మ, నియోజకవర్గ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, డి శివకుమార్, సుదర్శన్ కోరి, యువజన నాయకులు ఈసం లక్ష్మణ్, ఉల్లింగ సతీష్, పట్టణ మండల నాయకులు, 24 వ వార్డుల నాయకులు, మహిళా కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ని అవమానపరచడం యావత్ దేశాన్ని అవమానట్లే

*** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానపరచడం అంటే యావత్ దేశాన్ని అవమానపరిచినట్లేనని మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కొంపల్లి మున్సిపాలిటీ పలు వార్డులలో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ,కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ ఉస్మాషాకీర్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతి రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ. బీజేపీ పార్టీ మహాత్మ గాంధీ వారసత్వాన్ని ఇచ్చారన్నారు. బీజేపీ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాసౌమ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందాన్నారు. డివిజన్ స్థాయి,మండల స్థాయి, బూత్ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గోని విజయవంతం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్,లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు కందడి సుదర్శన్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్

## పోషణ పక్షం ' సమన్వయంతో నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో పోషణ పక్షం (పోషణ పక్వాడ ) కార్యక్రమాన్ని అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణలో భాగంగా పోషణ పక్షాన్ని ఈ నెల 8 నుంచి 22 వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణ లక్ష్యం ప్రధానంగా బలహీనంగా, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నపిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలను గుర్తించి ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల సమన్వయం అవసరమని చెప్పారు. పోషణ లోపం నివారణలో భాగంగా ఏ గ్రామంలోనూ పోషక లోపం ఉండకుండా చేయాలనే ప్రధాన భావంతో విజయవంతం చేసి పరిపూర్ణ ఆరోగ్యవంతం తయారు చేయాలని చెప్పారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ పోషకాహార మేళాలో భాగంగా, వివిధ రకాల పోషకాహార వంటకాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వంటకాలు గర్భిణీలు, బాలింతలు , ప్రీస్కూల్ పిల్లల ఆరోగ్యానికి ఉపయోగపడేలా రూపొందించాలని తెలిపారు. ఈ మేళాలో పోషకాహార నిపుణులు పాల్గొని ప్రజలకు పోషకాహారంపై సలహాలు అందించాలన్నారు. పోషకాహార మేళాలో, వివిధ రకాల పోషకాహార ఉత్పత్తులను విక్రయించాలని, ఈ ఉత్పత్తులు గర్భిణీలు, బాలింతలు మరియు ప్రీస్కూల్ పిల్లల ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి తెలిపారు . ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, నగరంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్, బస్తీ దవాఖానాలలో హిమోగ్లోబిన్ పరీక్షా వైద్య శిబిరాన్ని నిర్వహించాలన్నారు. 12 సంవత్సరాల బాలికల నుంచి 55 సంవత్సరాల మహిళల అనారోగ్య సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం పోషణ పక్షం వాల్ పోస్టర్ ను కలెక్టర్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మహిళ సంక్షేమ అధికారి లేనినా, వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో మూడు రోజులు వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలుపుతూ... ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, వరంగల్, హన్మకొండ, ఆదిలాబాద్, కొమురంబీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఏప్రిల్ 27 న వరంగల్ లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యాలు ప్రజా వ్యతిరేకత వరంగల్ సభ వేదికగా ఎండగట్టాలి అని ఆయన అన్నారు.27 న పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఉప్పల్ వ్యాప్తంగా గులాబీ జెండా ఎగరేయాలి అని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యాలు ప్రజా వ్యతిరేకత వరంగల్ సభ వేదికగా ఎండగట్టాలన్నారు. రేవంత్ రెడ్డి పాలన పెయిల్ అయింది.. హైడ్రా పేరుతొ పేద ప్రజల జీవితాలు నాశనం చేసిండు, భూముల అమ్మకాల పేరుతో మూగ జీవాల



గోస పోసుకున్నాడు. మూగ జీవాలు రేవంత్ రెడ్డిని క్షమించవు అని ఆయన అన్నారు. రుణమాఫీ చేస్తా అని సగం రుణమాఫీ చేసి చేతులు ఎత్తేసిండు అని ఆయన తెలిపారు. వానకాలం రైతుబంధు ఎగొట్టిన డబ్బులు 13 వేల కోట్లు.. రుణమాఫీ చేసింది 14 వేల కోట్లు అంటే రైతుబంధు ఎగొట్టి రుణ మాఫీ సగం చేసిండు అని ఆయన అన్నారు.ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున రావాలి అని ఆయన అన్నారు

# 5వ రోజుకు చేరిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 5వ రోజుకు చేరింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 17వ, 18వ డివిజన్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి , అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి ల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అని, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా, అదే విధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి, చిట్ల దివాకర్, కడియాల ఇందిరా, చౌదరి, ,జగదీష్ యాదవ్, కోలన్ జీవన్ రెడ్డి, కోలన్ బల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, జగన్ యాదవ్, అంజి బాబు, కృష్ణ గొల్ల, రమణి, హరీష్, జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు , వెంకటేష్ పటేల్, రాజి రెడ్డి, రాజేందర్, జిత్తు , ఏలూరి సత్య(నాని), పంగా శ్రీనివాసరావు, ఫణి, సత్య ప్రసాద్, ప్రసాద్,శ్రీశైలం, ప్రవీణ్ రెడ్డి, రాములు నాయక్, శ్రీనివాస్ రాజు (మీసాల రాజు), సురేష్ రెడ్డి, శరత్, మధుసూదన్ రెడ్డి, వీర బాబు, హరియా నాయక్, సాయి, ప్రేమ్, కోటేశ్వరి, నాగిన, సాయి రాజ్, నవ్య, మౌలేశ్వరరావు, నారాయణ రెడ్డి, మురళి, ప్రశాంత్ రెడ్డి, అది రెడ్డి, లక్ష్మణ్, శ్రీదేవి, యశోద, లక్ష్మి, గిరిజ కుమారి, సునీత, కరుణ, రమ, వరలక్ష్మి, సరిత రెడ్డి, రాణి,మొహమ్మద్, రఘు, హరి బాబు, నర్సింగ్ రావు, క్రాంతి, దినేష్, శివ నాగరాజు యాదవ్, రామానాయుడు,మహేందర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబంలో సన్న బియ్యంతో భోజనం చేసిన ఎమ్మెల్యే

యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అందిచిన సన్న బియ్యంతో వండిన భోజనాన్ని నిరుపేద దళిత కుటుంబ సభ్యులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కలసి భోజనం చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకోసం అందజేసిన సన్న బియ్యంతో పేద ప్రజల ఇంట్లో ప్రతి పండుగ చేసుకుంటున్నారని ఈరోజు వారితో కలిసి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాసరావు ఎంపీడీవో రాజా త్రివిక్రమ్ మండల పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి మల్లేశం మహిళా విభాగం నాయకురాలు బానోతు సునీత భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అద్దం అడుగు రాజేష్ పైలెట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశెట్టి చంద్రశేఖర్ మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ముస్తాబాద్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా పోచమల్ల వనిత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:కాంగ్రెస్ ముస్తాబాద్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా మోహినకుంట గ్రామానికి చెందిన పోచమల్ల వనిత నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత పోచమల్ల వనితను కాంగ్రెస్ ముస్తాబాద్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమిస్తూ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తనను నియమించిన జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, సహకరించిన సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కేకే మహేందర్రెడ్డి, మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్రెడ్డి, పలువురు నాయకులకు ఈ సందర్భంగా పోచమల్ల వనిత కృతజ్ఞతలు తెలిపారు.

## పేదింటి యువతుల వివాహానికి పెద్దన్నగా నిలుస్తోన్న సిఎం రేవంత్ రెడ్డి

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి
- 141 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:పేదింటి యువతుల వివాహానికి ప్రజా ప్రభుత్వపరంగా సహాయం అందిస్తూ పెద్దన్నగా సిఎం రేవంత్ రెడ్డి నిలుస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామానికి చెందిన 141 మంది లబ్ధిదారులకు మంజూరైన 1,41,16, 356 రూపాయల విలువజేసే కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్‌లో మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఇప్పటికే ప్రజా ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. మేనిఫెస్టోలో లేని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి సైతం ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, సన్న బియ్యం పంపిణీ చేస్తూ రాష్ట్రంలోని పేదల కడుపు నింపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ తలారి రాణి నరసయ్య, తహశీల్దార్ సురేష్, పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, వైస్ చైర్మన్ రాం రెడ్డి, రాజిరెడ్డి, కిషన్ రావు, మాజీ ఎంపిటిసి స్వేచ్ఛ రాజు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామాల అధ్యక్షులు, మండల, జిల్లా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: యాసంగి సీజన్‌లో జిల్లా పరిధిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి గాను మహిళా సంఘాల ద్వారా 191 కొనుగోలు కేంద్రాలకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. ఇందులో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 42, మెప్మా ద్వారా 6, డిసిఎంఎస్ ద్వారా 1 మొత్తం 240 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ముస్తాబాద్ మండలంలోని గూడెం, నామాపూర్, పోతుగల్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల్లో అధికంగా మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పించడం జరిగిందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. వేసవి కాలం నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. చల్లని త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ ఉండేలా చూసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్ సంచులు, ప్యాడీ క్లీనర్, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తలారి రాణి, డీఆర్డీఓ శేషాద్రి, పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, పౌర సరఫరాల మేనేజర్ రజిత, తహశీల్దార్ సురేష్, ఎంపీడీఓ బీరయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్‌ను గుదిబండలా మోపుతూ పేదలపై కనికరం చూపని మోడీ సర్కార్

* బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు భోంపెల్లి సురేందర్ రావు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:కేంద్రంలోని మోడీ సర్కారు తరుచూ గ్యాస్ ధరలను పెంచుతూ పేద ప్రజలపై గుదిబండలా మోపుతూ కనికరం చూపడం లేదని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు భోంపల్లి సురేందర్ రావు విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధరను, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచడాన్ని ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో అనేక సార్లు గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచడం జరిగిందని, మళ్లీ నిన్న కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పైన 50 రూపాయలు పెంచడాన్ని వారు తీవ్రంగా ఖండిరచారు. ప్రపంచ అంతర్జాతీయ ద్రవ్యవిధ సంస్థ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అప్పుల పట్ల ఆందోళనను వ్యక్తం చేసిన నేపథ్యంలో ఇంతగా అప్పులు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం సామాన్యుడు వంట చేసుకునే గ్యాస్ సిలిండర్ ధరను పెంచడాన్ని తీవ్రంగా ఖండిరచారు. వెంటనే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కోఆప్షన్ సర్వర్ పాషా, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఏద్దండి నర్సింహా రెడ్డి, ముస్తాబాద్ మండల ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, మాజీ కో అప్షన్ మెంబర్ అన్వర్, నాయకులు కంచం నర్సింలు, కోడె శ్రీనివాస్, జహంగీర్, వెంకటేష్, కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల అధ్యక్షుడు వంగూరి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## 15 నుంచి ఏపీలో ఇంటింటికీ 'మన మిత్ర' కార్యక్రమం




అమరావతి: ఇంటింటికీ 'మనమిత్ర' కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. వాట్సప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. ప్రతి పౌరుడి ఫోన్‌లో 9552300009 నంబర్‌ను సచివాలయ సిబ్బంది సేవ్ చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌కు కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ప్రజలకు అవగాహన పెంచేలా ప్రత్యేక కరపత్రం, వీడియో సందేశాన్ని విడుదల చేసింది. తద్వారా ప్రతి ఒక్కరూ వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించుకునేలా ఐటీ, రియల్ టైం గవర్నెన్స్ శాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 250కి పైగా సేవలందిస్తోంది. జూన్ నెలకు 500కు పైగా సేవలందించే దిశగా చర్యలు చేపట్టింది. తదుపరి దశలో 1000కిపైగా సేవల కల్పించాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా అధికారులు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా వాట్సప్ గవర్నెన్స్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అందుబాటులోకి తెచ్చారు. మనమిత్ర ఇప్పటికే ప్రజాభిమానం చూరగొంటుందని అధికారులు తెలిపారు. నిరక్షరాస్యుల కోసం వాయిస్ మెసేజ్ ద్వారా పనిచేసేలా ఏఐ ఆధారిత చాట్‌బాట్ ఏర్పాటు చేశారు. పౌరులందరూ తమ మొబైల్ ఫోనులో మనమిత్ర పేరిట 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## పార్టీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి

* కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్ పల్లి, , (ప్రజాస్ఫూర్తి) : ఈ నెల 27వ తేదీన జరుగు పార్టీ బహిరంగ సభకు.. కార్యకర్తలు నాయకులు ప్రజలను స్వచ్ఛందంగా విచ్చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేర్లింగంపల్లి నాయకులతో ఈ నెల 27వ తేదీన జరగబోవు బీఆర్ఎస్ బహిరంగ సభకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలనను ప్రతి ఒక్కరికి తెలిసేలా ఎండగట్టాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వల్ల అట్టడుగు వర్గాల నుంచి ఉన్నత స్థాయి వర్గాల వరకు అందరూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నేడు చిరు వ్యాపారస్తులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే వారు కూడా ఎంతో సతమతమవు ఉన్నారన్నారు..ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా , మాధవరం రంగారావు, నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, వాళ్ల హరీష్ రావు, కలిదిండి రోజా, రామకృష్ణ, గోపా శ్రీనివాస్, పి శ్రీకాంత్, కలీం , సిద్ధం శ్రీకాంత్, నక్క శ్రీనివాస్, సంజీవరెడ్డి తదితరులు నాయకులు పాల్గొన్నారు..

## తెలంగాణలో 10-15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్.. ఏప్రిల్ 10 నుంచి 'స్లాట్ బుకింగ్'



హైదరాబాద్: తెలంగాణలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఏప్రిల్ 10 నుంచి రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. తొలుత ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేయనున్నట్లు తెలిపారు. స్లాట్ బుకింగ్‌తో 10 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుందన్నారు.

## విచారణకు సహకరించాలి.. క్రిశాంక్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: భారాస నేత మన్నె క్రిశాంక్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల ఘటనలో నకిలీ వీడియోలు వైరల్ చేశారని పోలీసుల ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. విచారణకు సహకరించాలని ఆయన్ను ఆదేశించింది. కొణతం దిలీ ప్‌నకు నోటీసులు జారీ చేయాలని పోలీ సులను ఆదేశించి.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఒకే ఘటనపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వెల్లడించారు. రాజ కీయ దురుద్దేశంతోనే కేసులు పెట్టారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కంచ గచ్చిబౌలి భూముల ఘటనపై AI వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేసి వైరల్ చేశారని.. సీఎంపై అనుచిత పోస్టులు పెట్టారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు

# అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం.. కేంద్రం నోటిఫికేషన్ జారీ

దిల్లీ: ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 అమల్లోకి వచ్చింది. ఈ మేరకు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం (ఏప్రిల్ 8) నుంచే ఈ చట్టం అమల్లోకి తీసుకొస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల నుంచి ఈ బిల్లు పాస్ అవ్వగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ (సవరణ) బిల్లు చట్టంగా మారింది. ఈ నేపథ్యంలో నేటి నుంచే అమల్లోకి తీసుకొస్తున్నట్లు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు కేంద్రం తీసుకొచ్చిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు




ఆరోపిస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొత్తం 15 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం కేవియట్‌ను దాఖలు చేసింది. తమ అభిప్రాయం

## ఆ జిల్లాలో 13,500 మహిళల్లో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు..!



క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు మహారాష్ట్రలో నిర్వహించిన సర్వేలో ఆందోళనకర విషయం వెలుగుచూసింది. 'సంజీవని అభియాన్' పేరిట హింగోలీ జిల్లాలో స్థానిక యంత్రాంగం నిర్వహించిన డ్రైవ్‌లో 13,500 మంది మహిళల్లో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు కనిపించాయి. 7000 మందిలో సర్వైకల్ క్యాన్సర్, 3,500 మంది రొమ్ము క్యాన్సర్, 2000 మందిలో నోటి క్యాన్సర్ అనుమానిత లక్షణాలను గుర్తించినట్లు కలెక్టర్ అభినవ్ గోయల్ మీడియాతో వెల్లడించారు. మరికొందరిలో ఇతర క్యాన్సర్ లక్షణాలు కనిపించాయన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలోని 3.5 లక్షల మంది మహిళలపై సర్వే జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం స్క్రీనింగ్ ముగిసిందని, తర్వాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. నిపుణులు, శిక్షణ పొందిన వైద్యబృందం పర్యవేక్షణలో ఈ ప్రక్రియను చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

## సౌరభ్ బిడ్డ అయితే.. దత్తత తీసుకుంటాం : మర్చంట్ నేవీ అధికారి కుటుంబం

మేరఠ్: మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో నిందితురాలు, అతడి భార్య ముస్కాన్ రస్తోగి గర్భం దాల్చినట్లు వైద్య పరీక్షల్లో తేలిన సంగతి తెలిసిందే. దీనిపై బాధిత కుటుంబం స్పందించింది. ఒకవేళ ఆ బిడ్డ సౌరభ్‌కు చెందినది అయితే దత్తత తీసుకుంటామని తాజాగా వెల్లడించింది. ''ఆమె గర్భం దాల్చిన సంగతి మాకు తెలిసింది. ఒకవేళ బయోలాజికల్‌గా కడుపులోని బిడ్డ మా సోదరుడికి (సౌరభ్‌కు) చెందిందే అయితే.. పుట్టిన తర్వాత దత్తత తీసుకునేందుకు మా కుటుంబం సిద్ధంగా ఉంది. ఆ బిడ్డను పెంచుకునేందుకు మా అందరికీ ఇష్టమే'' అని సౌరభ్ సోదరుడు మీడియాకు వెల్లడించారు. కాగా.. ప్రేమించి పెళ్లాడిన భర్తను ప్రియుడి సాయంతో కట్టుకున్న



భార్యే దారుణంగా హత్య చేసి, ముక్కలు చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న నిందితురాలు ముస్కాన్‌కు ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆమె గర్భం దాల్చినట్లు తెలిసింది. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ కటారియా ఈ విషయాన్ని ప్రకటించారు. అయితే.. గర్భం దాల్చిన సంగతి నిందితురాలికి తెలియజేశారా అని మీడియా అడిగిన ప్రశ్నకు వైద్యుడు స్పందిస్తూ.. ''ఫలితాలు వచ్చిన సమయంలో ఈ విషయాన్ని ఆమెకు తెలియజేశారని అనుకుంటున్నా. కానీ, అల్ట్రాసౌండ్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే ఈ విషయాన్ని జైలు అధికారులు నిందితురాలికి అధికారికంగా తెలియజేస్తారు'' అని తెలిపారు. సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో నిందితులైన ముస్కాన్ రస్తోగి ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా జైలులో ఉన్నారు. నిందితుడిని కలిసేందుకు అతడి బామ్మ వస్తున్నారని.. కానీ, ముస్కాన్‌ను కలిసేందుకు ఎవరూ రావడం లేదని జైలు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఆమె గర్భం దాల్చిన విషయం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది.



## ఆ పేలుడు వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం

*** పంజాబ్ పోలీసులు**

పంజాబ్‌లో భాజపా నేత మనోరంజన్ కాలియా ఇంటి వద్ద గ్రనేడ్ దాడి కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ దాడి వెనుక మాస్టర్‌మైండ్ లారెన్స్ బిష్ణోయ్ సన్నిహితుడు జీషాన్ అక్తర్‌గా అనుమానిస్తున్నారు. ఇతడు ఎన్‌సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య కేసులో కూడా కీలక నిందితుడు. ఇతడి కోసం ఇప్పటికే పోలీసులు గాలిస్తున్నారు. రాష్ట్రంలో మతకలహాలు రేపటానికి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ సహకారం కూడా ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. పంజాబ్‌లోని జలంధర్‌లో నేటి తెల్లవారుజామున భాజపా నేత మనోరంజన్ కాలియా ఇంటి వద్ద గ్రనేడ్ దాడి జరిగింది. ''అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పేలుడుకు సంబంధించిన సమాచారం మాకు అందింది. వెంటనే మేము అక్కడకు వెళ్లి దర్యాప్తు చేపట్టాం. ఫోరెన్సిక్ బృందాలను కూడా రప్పించాము. సీసీటీవీ దృశ్యాలను పోలీసులు విశ్లేషిస్తున్నారు'' అని జలంధర్ పోలీస్ కమిషనర్ ధన్‌ప్రీత్ కౌర్ పేర్కొన్నారు. దీనిపై భాజపా నేత కాలియా మాట్లాడుతూ ''రాత్రి ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా భారీ పేలుడు వినిపించింది. అక్కడ పేలుడు జరిగిందని నాకు సమాచారం వచ్చింది. దీంతో నా గన్‌మెన్‌ను పోలీస్ స్టేషన్‌కు పంపి సమాచారం ఇచ్చాను'' అని పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ అక్కడకు చేరుకొని కాలియాతో మాట్లాడారు. ''పంజాబ్‌లో ఈ రకంగా గ్రనేడ్‌లు వాడటం అసాధారణం. పరిస్థితి చూస్తుంటే ఇక్కడ ఆటబొమ్మల దుకాణాల్లో కూడా అవి తేలిగ్గా లభిస్తున్నట్లు ఉన్నాయి. మనోరంజన్ కాలియా రాష్ట్రంలోనే అత్యంత సీనియర్ నాయకుల్లో ఒకరు. దుండగులు రిక్షాలో వచ్చి ఈ దాడి చేశారు'' అని తెలిపారు.

## జాతీయ నాయకులపై కుట్ర.. భాజపా–ఆర్‌ఎస్‌ఎస్‌పై ఖర్గే ఆరోపణలు

దిల్లీ: భాజపా ఆర్‌ఎస్‌ఎస్‌లపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. దేశం కోసం పోరాడిన జాతీయ నాయకులపై కుట్ర పన్నుతున్నారని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు సర్దార్ వల్లభాయ్ పటేల్ భావజాలానికి వ్యతిరేకమంటూ విమర్శించారు. మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''సర్దార్ వల్లభాయ్ పటేల్ భావజాలానికి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు వ్యతిరేకంగా ఉన్నాయి. స్వాతంత్ర్య సమరంలో ఏ మాత్రం పాలు పంచుకోని వాళ్లు.. ఇప్పుడు పటేల్ వారసులంటూ ప్రకటించుకోవడం హాస్యాస్పదం. భాజపా ఆర్‌ఎస్‌ఎస్ కలిసి జాతీయ నాయకులపై కుట్ర పన్నుతున్నాయి.



దేశంలో మతపరమైన విభజనలకు ప్రయత్నిస్తున్నారు. భారత్‌లోని ప్రాథమిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తున్నారు'' అని ఖర్గే ఆరోపించారు. ''కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్లుగా దేశ సేవలో నిమగ్నమై ఉంది. స్వాతంత్ర్య సమరంలో ఎంతో పోరాడింది. అలాంటి పార్టీకి ప్రస్తుతం దేశంలో వ్యతిరేక పరిస్థితులను సృష్టిస్తున్నారు. మన పార్టీని అంతం చేయాలని చూస్తున్నారు. స్వతంత్ర దేశం కోసం ఏమీ సాధించని వారే ఇదంతా చేస్తున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ మధ్య మంచి అనుబంధం ఉండేది. ఆ నేతలిద్దరు దేశం కోసం కలిసికట్టుగా పని చేశారు. అలాంటిది.. ఆ నాయకులు ఒకరితో మరొకరు వ్యతిరేకంగా ఉండేవారని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు'' అని మండిపడ్డారు. ''నెహ్రూ పటేల్ మధ్య నిత్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. అన్ని విషయాలపై నెహ్రూ ఆయన సలహాలు తీసుకునే వారు. పటేల్ అంటే ఆయనకు అమితమైన గౌరవం. ఏదైనా సలహా తీసుకోవాల్సి వస్తే స్వయంగా నెహ్రూనే పటేల్ ఇంటికి వెళ్లేవారు. పటేల్ సౌలభ్యం దృష్టి ఉంచుకుని సీడబ్ల్యూసీ సమావేశాలు ఆయన ఇంట్లోనే నిర్వహించేవారు. అలాంటి గొప్ప నాయకులపై భాజపా ఆర్‌ఎస్‌ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయి'' అని ఆరోపించారు.

## శిందేపై వివాదాస్పద వ్యాఖ్యలు.. కునాల్ కామ్రాకు స్వల్ప ఊరట

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందేపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా చిక్కుల్లో పడ్డారు. ఈ వివాదం నేపథ్యంలో తనపై నమోదైన కేసులు కొట్టివేయాలంటూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తాజాగా న్యాయస్థానంలో కునాల్‌కు స్వల్ప ఊరట లభించింది. ఏప్రిల్ 16 వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. శిందేపై వ్యాఖ్యల నేపథ్యంలో కునాల్‌పై పలు కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో విచారణ నిమిత్తం పోలీసులు ఆయనకు మూడుసార్లు సమన్లు జారీ చేశారు. విచారణకు గైర్హాజరైన ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం ఏప్రిల్ 16 వరకు కునాల్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. ఈ కేసులో ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. తనపై కేసు కొట్టేయాలంటూ కునాల్ వేసిన పిటిషన్‌పై మహారాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలపాలని కోరింది. ఇటీవల ముంబయిలోని యూనికాంటినెంటల్ హోటల్‌లో గల హాబిటాట్ కామెడీ స్టూడియోలో కునాల్ కామ్రా హాస్య వినోద కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేను ద్రోహిగా



అభివర్ణిస్తూ 'దిల్‌తో పాగల్ హై' హిందీ చిత్రంలోని ఒక సినీ గీతానికి పేరడీని కామ్రా ఆలపించడం ఈ వివాదానికి కారణమైంది. ఉప ముఖ్యమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు చేశారన్న కారణం చూపుతూ ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. ఆ వ్యాఖ్యలకు నిరసనగా హాబిటాట్ స్టూడియోపై 40 మంది శివసేన కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు.

## టీచర్ పోస్టులపై సీబీఐ దర్యాప్తు అక్కర్లేదు.. సుప్రీంలో దీదీ సర్కార్‌కు స్వల్ప ఊరట

దిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు నిమిత్తం హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో కొన్నింటిని సుప్రీంకోర్టు తాజాగా పక్కనపెట్టింది. అదనపు పోస్టుల సృష్టిపై రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సీబీఐ దర్యాప్తు అవసరం లేదని స్పష్టం చేసింది. ''నిపుణులతో చర్చలు జరిపిన తర్వాతే బెంగాల్ విద్యాశాఖ ఈ అదనపు పోస్టులను సృష్టించింది. దీనికి గవర్నర్ నుంచి ఆమోదం లభించింది. అలాంటప్పుడు ఇందులో న్యాయపరమైన జోక్యం అవసరం లేదు'' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. అయితే, టీచర్ల నియామకాల్లో ఇతర అవకతవకలకు సంబంధించిన ఇతర అంశాలు, ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతుందని కోర్టు పేర్కొంది. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు.

## నష్టాల నుంచి కోలుకున్న స్టాక్ మార్కెట్లు.. 74వేల ఎగువన సెన్సెక్స్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నాటి నష్టాల నుంచి కోలుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. చైనా సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించడంతో వాణిజ్య యుద్ధం భయాల మధ్య మార్కెట్లు ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. గ్లోబల్ మార్కెట్‌లో సానుకూల పవనాలతో మార్కెట్లు.. దేశీయ మార్కెట్లు సైతం లాభాల్లో మొదలయ్యాయి. కిందటి సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 74,013.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 73,424.92 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 74,859.39 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది.

చివరకు 1,089.18 పాయింట్లు లాభంతో 74,227.08 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం నిఫ్టీ 374.25 పాయింట్లు పెరిగి 22,535.85 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,968 షేర్లు లాభపడ్డాయి. మరో 843 షేర్లు పతనం కాగా.. మరో 115 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో జియో ఫైనాన్షియల్, శ్రీరామ్ ఫైనాన్స్, టైటాన్ కంపెనీ, సిప్లా, భారత్ ఎలక్ట్రానిక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. పవర్ గ్రిడ్ నష్టపోయింది. క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ, రియాల్టీ, టెలికాం, మీడియా రెండు నుంచి 4శాతం వరకు పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.8 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ రెండుశాతం వరకు పెరిగాయి.

## సింగిల్ చార్జింగ్ పై 260 కిలోమీటర్ల రేంజ్..

### అదరహో అనిపిస్తున్న టెస్రాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్



**న్యూఢిల్లీ:** మన దేశంలో రాడార్ సహాయక ముందు, వెనుక డాష్ క్యామ్ లను కలిగిన మొదటి స్కూటర్ టెస్రాక్ట్. ఇది రియల్ టైమ్ రైడ్ ఫుటేజ్ ను రికార్డు చేస్తుంది. అడ్వాన్స్ డ్ రైడర్ టైమ్ అసిస్టెన్స్ సిస్టమ్ (ఏఆర్ఏఎస్) కొలిషన్ అలారాలు, లేన్ చేంజ్ అసిస్టెన్స్ తదితర ఫీచర్లు ఉన్నాయి. రైడర్ భద్రతకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. స్కూటర్ లో 20.1 హార్స్ పవర్ ఎలక్ట్రిక్ మోటారు ఏర్పాటు చేశారు. గంటకు గరిష్టంగా 125 కిలోమీటర్ల వేగంగా పరిగెడుతుంది. దీనిలోని 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ద్వారా సింగిల్ చార్జింగ్ పై సుమారు 260 కిలోమీటర్ల రేంజ్ వస్తుంది. వేగవంతమైన చార్జర్ తో గంట కంటే తక్కువ సమయంలో 80 శాతం బ్యాటరీని చార్జింగ్ చేసుకోవచ్చు.

రైడర్ భద్రతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. రాడార్, డాష్ క్యామ్ వ్యవస్థలు చాలా ఉపయోగంగా ఉంటాయి. డ్యూయల్ చానల్ ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ తో సురక్షితమైన ప్రయాణం చేయవచ్చు. హ్యాండిల్ బార్ లపై హాప్టిక్ ఫీడ్ బ్యాక్, బ్లైండ్ స్పాట్ హెచ్చరికలు, స్మార్ట్ మిర్రర్లు అదనపు ప్రయోజనాన్ని అందిస్తాయి. స్కూటర్ లో ఏర్పాటు చేసిన ఆధునిక ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయి. దీనిలోని ఏడు అంగుళాల టీఎఫ్ టీ టచ్ స్క్రీన్ ద్వారా ఆన్ బోర్డు నావిగేషన్, స్మార్ట్ ఫోన్ కనెక్టివిటీ పొందవచ్చు. హాప్టిక్ ఫీడ్ బ్యాక్ హ్యాండిల్ బార్లు, వైర్ లెస్ స్మార్ట్ ఫోన్ చార్జింగ్, వైలెట్ ఏఐ ఇంటిగ్రేషన్ తో ప్రయాణం చాలా సౌకర్యంగా ఉంటుంది. సెల్ ఫోన్ ను చార్జింగ్ చేసుకునే అవకాశం, అండర్ సీటు స్టోరేజీలో హెల్మెట్ ను దాచుకోవచ్చు. వారెవ్వా అనిపించే డిజైన్ తో టెస్రాక్ట్ స్కూటర్ ఆకట్టుకుంటోంది. యుద్ధ హెలికాప్టర్ల నుంచి ప్రేరణ పొందిన షార్ప్ లేన్లు, డీఆర్ఎల్ లు, ట్విన్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్ ల్యాంపులు బాగున్నాయి. స్టీల్త్ బ్లాక్, సోనిక్ పింక్, డెసర్ట్ సాండ్ తదితర రంగులతో ఆకట్టుకుంటోంది. కీలెస్ యాక్సెస్, పార్క్ అసిస్ట్, హిల్ హూల్డ్ , క్రూయిజ్ కంట్రోల్ తదితర ఫీచర్లు ఉన్నాయి.

## తన ఆస్తిపై కీలక ప్రకటన చేసిన బిల్‌గేట్స్..



**న్యూయార్క్:** వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఎప్పుడూ ఏదో ఒక విషయంలో వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. కొన్నిసార్లు అతని బిలియన్ల రూపాయల ఆస్తుల గురించి, కొన్నిసార్లు అతని భార్య మెలిండాతో విడాకుల గురించి, మరియు కొన్నిసార్లు అతని దాతృత్వం గురించి. కానీ ఇప్పుడు బిల్ గేట్స్ తన సంపదలో ఒక శాతం మాత్రమే తన పిల్లలకు వదిలివేయాలని యోచిస్తున్నట్లు ప్రకటించి ప్రజలను ఆశ్చర్యపరిచాడు. తన పిల్లలు సంపదను వారసత్వంగా పొందడం కంటే స్వయంగా విజయం సాధించాలని తాను కోరుకుంటున్నానని ఆయన చెప్పుకొచ్చాడు. అయితే, మైక్రోసాఫ్ట్‌ను స్థాపించిన వ్యక్తికి, అతని నికర విలువలో ఒక భాగం కూడా బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. బిల్ గేట్స్ సంపద 162 బిలియన్లు (సుమారు రూ. 13,900 బిలియన్లు) అలాగే 1 శాతం 1.62 బిలియన్లు అవుతుంది. వారసత్వం లేకపోయినా, ముగ్గురు పిల్లల సంపద వారిని అత్యంత ధనవంతులైన వ్యక్తులలో అగ్రస్థానంలో నిలిపింది. తన పిల్లలు మంచి విద్య, పెంపకాన్ని పొందారని, కానీ ఇప్పుడు వారు తమ సొంత గుర్తింపును ఏర్పరచుకోవాలని బిల్ గేట్స్ ఒక పాడ్‌కాస్ట్‌లో అన్నారు. ఇది రాజ వంశం కాదు, నేను వారిని మైక్రోసాఫ్ట్ నడపమని అడగడం లేదు. వారు సొంతంగా డబ్బు సంపాదించుకుని విజయం సాధించడానికి ఒక అవకాశం ఇవ్వాలనుకుంటున్నాను. పిల్లలు స్వయంగా కష్టపడి పనిచేయడం ద్వారా ముందుకు సాగాలన్నారు. 69 ఏళ్ల బిల్ గేట్స్ ఇంతకుముందు కూడా తన సంపదనంతా తన పిల్లలకు ఇవ్వడం 'తప్పు' అని అన్నారు. తన మొత్తం సంపదను తన పిల్లలకు ఇవ్వకూడదని డైలీ మెయిల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పిల్లలందరికీ ఒక్కొక్కరికి 10 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 83 కోట్లు) మాత్రమే ఇస్తానని ఆయన చెప్పారు. పిల్లలకు ఎక్కువ డబ్బు ఇవ్వడం వారికి మంచిది కాదని చెప్పుకొచ్చారు.. బిల్ గేట్స్ తన 155 బిలియన్ డాలర్ల సంపదలో ఎక్కువ భాగాన్ని విరాళంగా ఇస్తామని ఇప్పటికే స్పష్టం చేశారు.

### బిల్ గేట్స్‌కు ఎంత మంది పిల్లలు ఉన్నారు?

బిల్ గేట్స్-మెలిండా ఫ్రెంచ్ గేట్స్ లకు 27 సంవత్సరాల వివాహంలో ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కూతురు జెన్నిఫర్ కేథరీన్ గేట్స్ (28), కొడుకు రోరీ జాన్ గేట్స్ (25), కూతురు ఫోబ్ అడెలె గేట్స్ (22) ఉన్నారు. పీపుల్ మ్యాగజైన్ ప్రకారం.. బిల్-మెలిండా తమ పిల్లలందరూ ఉన్నత పాఠశాల నుండి పట్టభద్రులయ్యే వరకు విడాకులను వాయిదా వేశారు. ఈ జంట 2021లో విడిపోయారు. వారి ముగ్గురు పిల్లలు కూడా వారి పెంపకంలో ఎక్కువ భాగం వెలుగులోకి రాలేదు. ఆమె తోబుట్టువులలో ఫోబ్ మాత్రమే ప్రజా జీవితంలో కనిపిస్తుంది.

# ప్రియాన్ష్ శతక గర్జన..

## ఛేదనలో మళ్లీ చేతులెత్తేసిన చెన్నై

**ముల్లాన్‌పూర్:** ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. ముల్లనూర్ మైదానంలో ప్రియాన్ష్ ఆర్య(103) మెరుపు సెంచరీతో భారీ స్కోర్ చేసిన పంజాబ్.. మాజీ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను 201కే కట్టడి చేసింది. ఈ సీజన్‌లో 190 ప్లస్ లక్ష్యాన్ని ఛేదించని సీఎస్కే మళ్లీ విఫలమైంది. ఓపెనర్ డెవాన్ కాన్వే(69 రిటైర్డ్ హర్ట్), ఇంప్యాక్ట్ ప్లేయర్ శివం దూబే(42) పోరాడారు. ఆఖర్లో ఎంఎస్ ధోనీ(22) ధనాధన్ ఆడినా ఓటమి తప్పించలేకపోయాడు. బౌలింగ్‌లో భారీగా పరుగులిచ్చిన చెన్నై.. బ్యాటింగ్‌లో ఉతికారేయలేక వరుసగా మూడో ఓటమి మూటగట్టుకుంది.

సొంత ఇలాకాలో పంజాబ్ కింగ్స్ పంజా విసిరింది. రాజస్థాన్ చేతిలో ఓటమి నుంచి తేరుకున్న పంజాబ్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించి.. మ్యాచ్‌ను సొంతం చేసుకుంది ప్రియాన్స్ ఆర్య() విధ్వంసక శతకం.. శశాంక్ సింగ్(54 నాటౌట్) హాఫ్ సెంచరీతో చెన్నై సూపర్ కింగ్స్‌కు 220 పరుగుల టార్గెట్ ఇచ్చింది. ఛేదనలో ఓపెనర్ రచిన్ రవీంద్ర(36) ధాటిగా ఆడాడు.





కానీ, గ్లెన్ మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(1) ఫెర్గూసన్ బౌలింగ్‌లో సులువైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 62 వద్ద రెండో వికెట్ పడడంతో.. ఇంప్యాక్ట్ ప్లేయర్ శివం దూబే(42) ఓపెనర్ డెవాన్ కాన్వే(69 రిటైర్డ్ హర్ట్)లు మూడో వికెట్‌కు 90 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే.. దూబేను బౌల్డ్ చేసిన ఫెర్గూసన్ చెన్నైకి షాకిచ్చాడు. ఎంఎస్ ధోనీ(22), 19వ ఓవర్లో 4, 6 బాదడంతో సీఎస్కే స్కోర్ 190 దాటింది. యశ్ ఠాకూర్ వేసిన 20వ ఓవర్ తొలి బంతికే ధోనీ ఔటయ్యాడు. ఆఖరి ఓవర్లో 9 రన్స్ మాత్రమే రావడంతో చెన్నై జట్టు విజయానికి 19 పరుగుల దూరంలో నిలిచిపోయింది.

ప్రియాన్ష్, శశాంక్ మెరుపులతో..

సొంతమైదానంలో పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(103) విధ్వంసక సెంచరీ సాధించాడు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లను ఊచకోత కోస్తూ 39 బంతుల్లోనే శతకంతో గర్జించాడీ హిట్టర్. క్రీజులో ఉన్నంత సేపు ఫోర్లు, సిక్సర్లతో సీఎస్కే బౌలర్లకు చుక్కలు చూపించాడీ యంగ్‌స్టర్. పవర్ ప్లేలోపే 3 కీలక వికెట్లు పడిన పంజాబ్‌ను ఆదుకున్న ప్రియాన్ష్.. 19 బంతుల్లోనే ఐపీఎల్‌లో తొలి అర్ధ శతకం బాదాడు. ఆ తర్వాత శశాంక్ సింగ్(54 నాటౌట్)జతగా కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మరో 20 బంతుల్లోనే సెంచరీకి చేరువైన ప్రియాన్ష్ ఈ మెగా టోర్నీలో అత్యంత వేగవంతమైన వంద బాదిన నాలుగో క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇక డెత్ ఓవర్లలో మార్కో యాన్సెస్(34 నాటౌట్) సైతం బ్యాట్ ఝులిపించడంతో పంజాబ్ స్కోర్ 19 ఓవర్‌కే రెండొందలు దాటింది. పథిరన వేసిన ఆఖరి ఓవర్లో శశాంక్ ఒక సిక్సర్ బాదగా.. చివరి బంతికి 3 రన్స్ తీశారు. దాంతో పంజాబ్ 6 వికెట్ల నష్టానికి 219 రన్స్ కొట్టింది.

## ముక్కోణపు వన్డే సిరీస్ కోసం భారత జట్టు ప్రకటన..!

### ఈ నెల 27న శ్రీలంకతో తొలి మ్యాచ్ ఆడనున్న టీమిండియా

**న్యూఢిల్లీ:** ఈ నెల చివరి నుంచి శ్రీలంక వేదికగా జరుగనున్న ముక్కోణపు వన్డే సిరీస్ కోసం బీసీసీఐ భారత మహిళా జట్టును ప్రకటించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తిరిగి జట్టుతో చేరింది. జనవరిలో ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌కు విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. ట్రై సిరీస్‌కు బీసీసీఐ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నది. ఈ ముక్కోణపు వన్డే సిరీస్ ఏప్రిల్ 27న మొదలుకానున్నది. చివరి మ్యాచ్ మే 11న జరుగుతుంది. భారత్, శ్రీలంకతో పాటు దక్షిణాఫ్రికా ఈ సిరీస్‌లో ఆడుతుంది. ఈ టోర్నీ డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. భారత జట్టు ఏప్రిల్ 27న శ్రీలంకతో తన తొలి మ్యాచ్ ఆడుతుంది. మూడు జట్లు ఒక్కొక్కటి నాలుగు మ్యాచ్‌లు ఆడనున్నాయి. తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. అన్ని మ్యాచులు కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలోనే జరుగన్నాయి. ఫాస్ట్ బౌలర్లు రేణుకా సింగ్ ఠాకూర్, టిటాస్ సాధు గాయపడ్డారు. దాంతో వారిని ఎంపిక చేయలేదు. కశ్వి గౌతమ్, శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయ్‌కి జట్టులో చోటు దక్కింది. ఈ ముగ్గురికి తొలిసారిగా జాతీయ జట్టులోకి చోటు దక్కింది.

టోర్నమెంట్‌లో తొమ్మిది మ్యాచ్‌ల్లో మొత్తం 11 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో తొలిసారి భారత జట్టులో ఛాన్స్ ఆడే అవకాశం దక్కింది. 20 ఏళ్ల శ్రీ చరణి ఎడమచేతి వాటం స్పిన్నర్.




ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఆమె రెండు మ్యాచ్‌లు ఆడి నాలుగు వికెట్లు తీసింది. మరో ఎడమచేతి వాటం స్పిన్నర్ శుచి సీనియర్ ఉమెన్స్ వన్డే ట్రోఫీ టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్. ఆమె తొమ్మిది ఇన్నింగ్స్‌లలో 3.48 ఎకానమీ రేటుతో 18 వికెట్లు పడగొట్టింది. ఆమె ప్రాతినిథ్యం వహించిన మధ్యప్రదేశ్ జట్టు ట్రోఫీని గెలిచింది. శుచి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచింది.

### కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్

భారత్ ఐర్లాండ్‌తో జరిగిన చివరి వన్డే సిరీస్‌ను 3-0తో గెలుచుకుంది. హర్మన్‌ప్రీత్ ఈ సిరీస్‌కు దూరమైంది. ఆమె గైర్హాజరీలో స్మృతి మంధాన కెప్టెన్‌గా, దీప్తి శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించింది. డిసెంబర్ 2024లో వెస్టిండీస్‌తో జరిగిన స్వదేశీ సిరీస్ సమయంలో హర్మన్‌ప్రీత్ మోకాలి గాయంతో ఇబ్బందిపడింది. అంతకుముందు 2024 అక్టోబర్‌లో మహిళల టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మెడకు గాయమైన విషయం తెలిసిందే. హర్మన్‌ప్రీత్ గత నెలలో మహిళల ప్రీమియర్ లీగ్‌తో మళ్లీ మైదానంలోకి వచ్చింది.

## విడాకులకు సిద్ధమైన మేరీకోమ్..

### అసెంబ్లీ ఎన్నికలే కారణమా..!

**న్యూఢిల్లీ:** భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు సార్లు వరల్డ్ ఛాంపియన్ అయిన ఆమె తన వివాహ బంధానికి ముగింపు పలికేందుకు సిద్ధమైంది. భర్త కరుంగ్ ఒంఖెలర్‌తో విభేదాల కారణంగా.. అతడి నుంచి విడిపోవాలని నిర్ణయించుకుంది మణిపూర్ మణిపూస. దాంతో, ఈ జంట త్వరలోనే డైవొర్స్ తీసుకోనుందనే వార్తలు ప్రచారమవుతున్నాయి. 20 ఏళ్లు అన్యోన్యంగా ఉన్న వీళ్లు.. హఠాత్తుగా బ్రేకప్ చెప్పుకోవడానికి కారణం ఏంటంటే..

మూడేళ్ల క్రితం జరిగిన మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో మేరీకోమ్ భర్త కరుంగ్ పోటీ చేసి ఓడిపోయాడు. ఆ తర్వాత నుంచి మేరీకి, అతడికి పొసగడం లేదు. ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయని సమాచారం. దాంతో, కొంతకాలంగా ఇరువురు విడిగా ఉంటున్నారు. కానీ, ఇప్పటివరకూ విడాకులకు మాత్రం దరఖాస్తు చేయలేదు ఈ జంట.

భర్తతో ఉండడం ఇష్టంలేని బాక్సర్.. అతడితో 20 ఏళ్ల వైవాహిక జీవితాన్నిముగించాలని అనుకుందట. అందుకే.. తన ముగ్గురు పిల్లలను తీసుకొని ఫరీదాబాద్‌కు వెళ్లింది. ప్రస్తుతం కరుంగ్ ఢిల్లీలో ఉంటున్నాడు. అయితే.. మేరో కామ్ ఒక మహిళా బాక్సర్ భర్తతో డేటింగ్‌లో ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ న్యూస్ ఎంత వరకు నిజం? అనేది మరికొన్ని రోజుల్లోనే తేలిపోనుంది.



ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ నుంచి వచ్చిన మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్‌లో తన ముద్ర వేసింది. విశ్వ వేదికలపై యావత్ భారతం గర్వించదగ్గ విజయాలు సాధించింది. రింగ్‌లో తన పవర్ పంచ్‌లతో ప్రత్యర్థులను చిత్తు చేసిన ఆమె ఏకంగా ఆరు సార్లు ప్రపంచ ఛాంపియన్ టైటిల్ గెలుపొందింది. 2012లో లండన్ ఆతిథ్యమిచ్చిన ఒలింపిక్స్‌లో కాంస్యంతో చరిత్ర సృష్టించిన మేరీ.. ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచింది. బాక్సింగ్ లెజెండ్‌గా పేరొందిన ఆమె.. అనుకోకుండా ప్యారిస్ ఒలింపిక్స్‌కు ముందు చెఫ్ డి మిషన్ బాధ్యతల నుంచి వైదొలిగింది. అయితే.. తను ఇంకా ఆటకు మాత్రం వీడ్కోలు పలకలేదు.

## రహానే, రింకూ పోరాటం వృథా..

### ఉత్కంఠ పోరులో లక్నోదే విజయం



**కోల్‌కతా:** ఐపీఎల్ 18వ సీజన్‌లో మరో భారీ స్కోరింగ్ మ్యాచ్. ఓపెనర షాన్ మార్ష్(81) విధ్వంసానికి నికోలస్ పూరన్(87 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ తోడవ్వడంతో కొండంత స్కోర్ కొట్టిన లక్నో సూపర్ జెయింట్స్‌నే విజయం వరించింది. ఈడెన్ గార్డెన్స్‌లో ఆద్యంత ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో లక్నో 4 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై జయభేరి మోగించింది. 239 పరుగుల ఛేదనలో కెప్టెన్ అజింక్యా రహానే(61), వెంకటేశ్ అయ్యర్(45)ల జోరుతో 163-3తో పటిష్ట స్థితిలో నిలిచింది కోల్‌కతా. అయితే.. శార్దూల్ ఠాకూర్(2-52), అవేశ్ ఖాన్‌ల విజృంభణతో వరుసగా వికెట్లు కోల్పోయింది. రింకూ సింగ్(38 నాటౌట్) మెరుపులతో గెలుపు వాకిట నిలిచిన డిఫెండింగ్ ఛాంపియన్ 234కే పరిమితమైంది. రవి బిష్ణోయ్ వేసిన 20వ ఓవర్లో రింకూ 2 ఫోర్లు, ఒక సిక్సర్ బాదినా జట్టును గెలిపించలేకపోయాడు. సొంత గడ్డపై వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది కోల్‌కతా.

### దంచేసిన రహానే, వెంకటేశ్

సొంత మైదానంలో భారీ ఛేదనకు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ చివరిదాకా పోరాడింది. ఓపెనర్లు క్వింటన్ డికాక్(15) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా కెప్టెన్ అజింక్యా రహానే(61)తో కలిసి సునీల్ నరైన్(30) బౌండరీలతో చెలరేగాడు. రెండో వికెట్‌కు 60 రన్స్ జోడించాడు. ప్రమాదకరంగా మారిన ఈ డాషింగ్ ఓపెనర్‌ను మిస్టరీ స్పిన్నర్ దిగ్వేశ్ రథీ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వెంకటేశ్ అయ్యర్(45), రహానే ధాటిగా ఆడడంతో 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది ఆతిథ్య ట్టు. విజయానికి చేరువైన దశలో శార్దూల్ ఠాకూర్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. 5 వైడ్స్ వేసిన అతడు ఆఖరి బంతికి రహేనేను ఔట్ చేసి కోల్‌కతాకు షాకిచ్చాడు.

రహానే ఔటయ్యే సరికి కోల్‌కతా విజయానికి 77 పరుగుల అవసర కాగా.. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన రమన్‌దీప్ సింగ్(1)ను రవి బిష్ణోయ్ డగౌట్‌కు పంపాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అంగ్‌క్రిష్ రఘువంశీ(5) ఒక బౌండరీ బాది ఉసూరుమనిపించాడు. ఆ తర్వాత.. కాసేపటికే వెంకటేశ్ అయ్యర్(45) ఔటయ్యాడు. శార్దూల్ బౌలింగ్‌లో ఆండ్రూ రస్సెల్(7) పెద్ద షాట్ ఆడే క్రమంలో మర్క్‌రమ్ చేతికి చిక్కాడు. దాంతో, 185కే కోల్‌కతా 7 వికెట్లు పడ్డాయి. ప్రధాన ఆటగాళ్లంతా పెవిలియన్ చేరడంతో గెలుపు భారం రింకూ సింగ్(38 నాటౌట్)పై పడింది హర్షిత్ రానా (10 నాటౌట్).. దిగ్వేశ్ రథీ ఓవర్లో రంకూ ఒక బౌండరీ సంధించగా కోల్‌కతా స్కోర్ 200లకు చేరింది. అవేశ్ ఖాన్ వేసిన19వ ఓవర్లో లెగ్ సైడ్ బంతిని స్టాండ్స్‌లోకి పంపిన రింకూ.. ఇంకో రెండు ఫోర్లు కొట్టాడు. ఆఖరి ఓవర్లో 24 పరుగులు అవసరం కాగా.. హర్సిత్ తొలి బంతికి బౌండరీ సాధించాడు. నాలుగు, ఐదు బంతుల్ని రింకూ బౌండరీకి తరలించి.. ఆఖరి బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో, 4 పరుగుల తేడాతో కోల్‌కతా ఓటమి పాలైంది.

### చితక్కొట్టిన పూరన్, మార్ష్

ఐపీఎల్ 18వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఈడెన్ గార్డెన్స్‌లో తమ విధ్వంసంతో కొండంత స్కోర్ అందించారు. మొదట ఓపెనర్ షాన్ మార్ష్(81) సైతం తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత నికోలస్ పూరన్(87 నాటౌట్) పట్టపగలే కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. క్రీజులోకి రావడమే ఆలస్యం బౌండరీలతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడిగు అర్ధ శతకంతో గర్జించాడు. రస్సెల్ వేసిన 18వ ఓవర్లో 4, 4, 6, 4, 6 బాదిన ఈ చిచ్చర పిడుగు 24 పరుగులు పిండుకున్నాడు. దాంతో, లక్నో స్కోర్ 200 దాటింది. పూరన్ మెరుపులతో ఆఖరి ఐదు ఓవర్లలో 86 పరుగులు రాబట్టింది. వీళ్లిద్దరి విధ్వంసక బ్యాటింగ్ ఫలితంగా కోల్‌కతా కంచుకోటలో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది.

# 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీ సెన్సార్ కంప్లీట్..



## కళ్యాణ్ రామ్‌కు బ్లాక్ బస్టర్ హిట్టు పడినట్లేగా!

టాకీస్: అగ్ర కథానాయకుడు నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం అర్జున్ సన్నాఫ్ వైజయంతి. కొత్త దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాలో సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించగా.. లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ప్రధాన పాత్రలో నటిస్తోంది. కర్తవ్యం సినిమాలో విజయశాంతి పేరు వైజయంతి కాగా ఇప్పుడు ఈ సినిమాలో కూడా అదే పేరు పెట్టారు. ఈ మూవీలో విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్ గానే కనిపిస్తోంది. ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టని వైజయంతి కొడుకు విషయంలో ఏం చేసింది అనే కోణంలో సాగే కథలా ఈ సినిమా ఉండబోతుంది. ఏప్రిల్ 18న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది ఈ చిత్రం సెన్సార్ సభ్యులు ఈ సినిమాకు యు/ఏ సర్టిఫికేట్‌ను అందించడంతో పాటు మూవీ బ్లాక్ బస్టర్ అని చెప్పినట్లు టాక్ వినిపిస్తుంది. ఈ సినిమా 2 గంటల 24 నిమిషాల నిడివితో రాబోతుండగా.. యాక్షన్, భావోద్వేగం, ఉత్కంఠను సమపాళ్లలో అందించనునున్నట్లు సెన్సార్ సభ్యులు తెలిపారు. ప్రేక్షకులను ప్రతి క్షణం ఆకర్షించే విధంగా ఈ చిత్రం తీర్చిదిద్దబడింది. ఉర్రూతలూగించే యాక్షన్ దృశ్యాల నుంచి తల్లీకొడుకుల హృదయాన్ని హత్తుకునే డ్రామా వరకు అన్నీ ఆసక్తికరంగా ఉన్నాయి.

కళ్యాణ్ రామ్ ఒక బాధ్యతాయుతమైన కొడుకు పాత్రలో బలమైన నటనను ప్రదర్శించగా, విజయశాంతి తల్లిగా తన ప్రభావశీల నటనతో భావోద్వేగ లోతును తీసుకొచ్చారు. కథ రెండవ భాగంలో తల్లీకొడుకుల సంబంధం పరిణామం చెందుతూ, భావోద్వేగ లోతును ఉద్విగ్న యాక్షన్‌తో సమతుల్యం చేస్తుంది. చివరిలో వచ్చే అద్భుతమైన ట్విస్ట్ ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠలో ఉంచుతుంది.

దర్శకుడు ప్రదీప్ చిలుకూరి ఈ కథను చాలా నైపుణ్యంగా నిర్వహించారు. రామ్ ప్రసాద్ ఆకర్షణీయమైన సినిమాటోగ్రఫీ, బి. అజనీష్ లోక్‌నాథ్ ఉత్తేజకరమైన సంగీతం ఈ సినిమాకు అదనపు ఆకర్షణలు. అశోక వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై నిర్మించిన ఈ చిత్రం అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందింది.

# సితారలో సంయుక్త హ్యాట్రిక్




టాకీస్: నిర్మాణ సంస్థలకు అచ్చొచ్చిన హీరోలు ఉంటారు. ఒక్కో బ్యానర్.. కొంతమంది హీరోలకే పరిమితం అవుతుంటుంది. వాళ్లతో పదే పదే సినిమాలు చేస్తుంటుంది. అయితే ఇదే సెంటిమెంట్ హీరోయిన్ల విషయంలో పెద్దగా ఉండదు. ఎవరు అందుబాటులో ఉంటే, వాళ్లతో ప్రొసీడ్ అవుతుంటారు. కాకపోతే.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థకు సంయుక్త మీనన్ సెంటిమెంట్ గా మారిపోతోందేమో అనిపిస్తోంది. సితార తీసిన 'భీమ్లా నాయక్', 'సార్' సినిమాల్లో సంయుక్త కథానాయికగా నటించింది. ఇప్పుడు మరోసారి ఈ సంస్థలో సంయుక్త పని చేయబోతున్నట్టు టాక్. సూర్య - వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకొంటోంది. ఈ సినిమాలో కథానాయికగా సంయుక్తని ఎంచుకొన్నారని వార్తలొస్తున్నాయి. ఇది వరకు హీరోయిన్ పోస్ట్ కోసం భాగ్యశ్రీ బోర్సే, కయాదు లోహర్ పేర్లు గట్టిగా వినిపించాయి. ఇప్పుడైతే.. సంయుక్త ఖాయం అంటున్నారు. అదే జరిగితే.. సితారలో సంయుక్తకు ఇది హ్యాట్రిక్ సినిమా అవుతుంది. 'లక్కీ భాస్కర్'తో ఓ హిట్టు కొట్టాడు వెంకీ అట్లూరి. అది కూడా సితార సంస్థలో నిర్మించిన చిత్రమే. ఇప్పుడు అదే బ్యానర్‌లో వెంకీ కూడా మరో సినిమా చేయబోతున్నాడు. మెగాస్టార్ చిరంజీవికి కూడా వెంకీ ఓ కథ చెప్పాడన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా కూడా సితార సంస్థే నిర్మించబోతోంది. ఆ లెక్కన వెంకీ అట్లూరి కూడా సితారలో హ్యాట్రిక్ కొట్టబోతున్నాడన్నమాట.

# అల్లు అర్జున్ బర్త్‌డే స్పెషల్

## అట్లీ దర్శకత్వంలో బన్నీ సినిమా

## స్పెషల్ వీడియో విడుదల చేసిన మేకర్స్



టాకీస్: అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్ వచ్చింది. స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ సినిమా చేయనున్నట్లు అధికారికంగా వెల్లడైంది. సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థపై ఇది రానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఆయనకు విషెస్ చెప్పింది. మొత్తంగా అల్లు అర్జున్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. పుష్ప 2 ది రూల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పారు. తమిళ దర్శకుడు అట్లీతో తన తదుపరి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్పెషల్ వీడియోను విడుదల చేశారు. పుష్ప' సినిమాతో నేషనల్ అవార్డు అందుకొని అల్లు అర్జున్ ట్రెండ్ సెట్ చేశారు. దీని రెండో భాగం భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో బన్నీ తర్వాత ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. హిట్ దర్శకుడు అట్లీతో ఓ సినిమా చేయనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడిదే విషయాన్ని ఖరారు చేస్తూ సన్ పిక్చర్స్ పోస్ట్ పెట్టింది. ఈ ప్రాజెక్ట్ వివరాలు పంచుకుంటూ ఓ వీడియో విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు వీడియోలో చూపించారు. అభిమానుల ఊహలకు అందని రీతిలో ఈ సినిమా ఉండనుందని తెలిపారు. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించ నున్నారు. దీని కోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించారు. హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ నిపుణులు మాట్లాడుతూ.. ఇప్పటివరకూ ఇలాంటి స్క్రిప్ట్ ఇప్పటివరకూ చూడలే మొదట అల్లు అర్జున్ ,అట్లీ, నిర్మాత కళానిధి మారన్ కలిసి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు చూపించిన మేకర్స్.. ప్రీ ప్రొడక్షన్ పనుల కోసం లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించినట్లు చూపించారు. ఇందులోనే అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన చేయగా.. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్ చూస్తుంటే.. గ్రాఫిక్స్ ప్రధాన పాత్ర పోషించబోతున్నట్లు తెలుస్తుంది.



# అఖిల్ బర్త్‌డే స్పెషల్.. 'లెనిన్' టైటిల్ గ్లింప్స్ రిలీజ్




టాకీస్: కెరీర్‌లో ఒక్క బ్లాక్‌బస్టర్ హిట్ అయిన కొట్టాలని తెగ ఎదురుచూస్తున్నాడు యువ హీరో అక్కినేని అఖిల్. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో సక్సెస్‌కాకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు అఖిల్. ఈ క్రమంలోనే కొత్త దర్శకుడితో సినిమా చేస్తున్నాడు. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం లెనిన్. ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా.. అఖిల్ స్వీయ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. నేడు అఖిల్ బర్త్‌డే సందర్భంగా మూవీ నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్.

గతాన్ని తరమటానికి పోతా.. మా నాయిన నాకో మాట సెప్పినాడు. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటాదిరా పేరు ఉండదు. అట్నే పోయేటప్పుడు ఊపిరి ఉండదు పేరు మాత్రమే ఉంటాది. ఈ పేరు ఎట్లా నిలబడాలి అంటే అంటూ పవర్‌ఫుల్‌గా సాగింది ఈ గ్లింప్స్. ఈ వీడియో చూస్తుంటే.. రూరల్ లవ్ డ్రామాగా ఈ సినిమా రాబోతుంది. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తుండగా.. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నాడు.

# బిజీగా ఉంటేనే..ప్రశాంతంగా ఉంటా

## నటి రకుల్ ప్రీత్ మనసులో మాట

టాకీస్: నేను ఎంత బిజీగా ఉంటే అంత ప్రశాంతంగా ఉంటాను. వరుస షూటింగ్ షెడ్యూల్స్ ఉన్నప్పడు ఒత్తిడిగా అనిపించదు. షూటింగ్స్ లేనప్పడు విరామ సమయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతాను. ప్రతిరోజూ వర్క్‌కు వెళ్లడం, కెమెరాను ఎదుర్కోవడం నా జీవితంలో భాగమయ్యాయి. ఈ దినచర్యే నన్ను ఉన్నత స్థానానికి తీసుకుని వెళ్లింది.... ఎప్పటికీ ఇదే కొనసాగాలని కోరుకుంటున్నానని నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు.

తన 16 ఏళ్ల కెరీర్‌పై రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... జీవితంలో ఎన్ని ఒడుదొడుకులు ఉన్నా ముందుకు సాగాలన్నారు. టాలీవుడ్, బాలీవుడ్ ప్రేక్షకుల ఆదరణ పొందడానికి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. చిత్రపరిశ్రమలో జయాపజయాలు సహజం. అవి జీవితంలోనూ భాగమే. కెరీర్‌లో స్థిరపడే కొద్దీ మార్పులు వస్తాయి. ఎన్ని కష్టాలు వచ్చినా తిరిగి రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగాలి. కన్నడ చిత్రం 'గిల్లీ'తో తెరంగేట్రం చేసిన రకుల్ దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ అవకాశాలు అందుకుంటున్నారు. ఇటీవలే 'మేరే హస్బెండ్ కీ బీవీ'తో పలకరించారు. ఈ సినిమాకు ఆమె భర్త జాకీ భగ్నానీ నిర్మాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆమె అజయ్ దేవ్‌గణ్, మాధవన్‌లు ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నారు. అలాగే నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న రామయణలోనూ ఆమె శూర్పణఖగా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.